

TGTEL/25/A1713

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక :236 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | వెల : 4/-

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



## వైఎస్ పేదల కోసం గుర్తించిన స్థలాలు నెల రోజుల్లో ఇస్తాం

- 2024లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసి, ఆవాస్ యోజన అర్హత కలిగిన 11,56,929 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం
- రాష్ట్ర ప్రభుత్వం 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోంది
- భవిష్యత్‌లో అర్హులకు మూడు, నాలుగో విడతలో కూడా ఇళ్లు ఇవ్వాలని ఆలోచిస్తోంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

# ‘సర్’తో ప్రమాదం!



- ఈ ప్రమాదం వెనుక ఉన్న ఆంతర్యాన్ని నేతలు గ్రహించాలి
- ‘సర్’ ప్రక్రియను తీవ్రంగా పరిగణించాలి..అర్హులైన వారి ఓట్లు కాపాడాలి
- దేశ వ్యాప్తంగా 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి
- ఓట్ల తొలగింపు ప్రమాదం మన దరిదాపులకు రానీయొద్దు
- ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి
- శాసనసభ జరగకుండా ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన కుట్ర
- అసెంబ్లీ ఘటనలపై ఫ్లాష్ సర్వేలో కాంగ్రెస్‌కు చాలా పాజిటివ్‌గా వచ్చింది
- సభ జరిగినన్ని రోజులూ కాంగ్రెస్ సభ్యులు పూర్తిగా హాజరు కావాలన్న సీఎం

హైదరాబాద్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదం వెనుక ఉన్న ఆంతర్యాన్ని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు గ్రహించాలని చెప్పారు. ఎస్ఐఆర్‌ను చాలా సీరియస్‌గా తీసుకోవాలని అన్నారు. ఈ విషయం ఇప్పటికే పలుమార్లు చెప్పానని, ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను - మిగతా3లో




## ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు

- సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ
- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

# ఫ్యూచర్ లేని సిటీ





- ఫ్యూచర్ లేని సీఎం తన సోదరులతో కలిసి రియల్ ఎస్టేట్ నాటకం ఆడుతున్నారు
- ఇందులో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు..బలి పశువులు కావొద్దు
- టెస్సెరాక్ట్ కంపెనీకి ఏటా రూ.లక్ష కూడా టర్నోవర్ లేదు
- రూ.250 కోట్లు విలువ చేసే భూములను రూ.7 కోట్లకే కట్టబెట్టడంపై కోర్టులను ఆశ్రయిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహేశ్వరంలో టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూమిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

## అంతరిక్షం అందరిదీ,.. బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి

- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో మోదీ వర్చువల్ ప్రసంగం
- అంతర్జాతీయ చట్టాల ఆధారంగా సురక్షిత, శాంతియుత, సుస్థిర అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు
- ‘శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది
- ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది





## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం

- కార్గో నౌకలో 20 మంది మృతి
- చైనాలోని కింగ్‌డావో షిప్‌యార్డ్‌లో కార్గో నౌకలో భారీ అగ్నిప్రమాదం
- ఈ దుర్ఘటనలో 20 మంది సిబ్బంది మృతి, ఐదుగురు గల్లంతు
- మరమ్మతుల కోసం ఆగిన ‘ఓషన్ మెలోడీ’ నౌకలో ఘటన
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం


## నినాదాల హోరు.. పాటల జోరు

- శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన
- ‘22ఏ’పై వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష ఎమ్మెల్సీలు
- ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు పట్టు...
- వాయిదా తీర్మానం తిరస్కరించినట్లు చైర్మన్ ప్రకటన
- నిరసనగా వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు



హైదరాబాద్

బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు...నిరసన పాటలతో గురువారం శాసన మండలిలో గందరగోళం నెలకొంది. నిషేధిత భూముల (22ఏ) అంశంపై చర్చకు వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష సభ్యులు దానిపై చర్చకు పట్టుబట్టారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ వాయిదా తీర్మానాన్ని అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోడియం వైపు దూసుకొచ్చి నినాదాలు, నిరసన పాటలతో హోరెత్తించారు. తీర్మానం తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించడంతో నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన వెంటనే చైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. అయితే 22ఏ అంశంపై ఇచ్చిన వాయిదా తీర్మానం చర్చకు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో - మిగతా3లో



## 18 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగం

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు
- పిల్లల ఆన్‌లైన్ భద్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మైనర్లు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించడంపై రక్షణ చర్యలు కోరుతూ పిటిషన్
- దీనిపై కేంద్రానికి నోటీసులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం

## జల విద్యుత్ ప్రాజెక్టులపై సోలార్ విద్యుత్

- నీటిపారుదల, విద్యుత్ శాఖల సమన్వయ కృషి
- సభలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు వ్యయం ఎక్కువ అవుతుంది
- సౌర విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం



హైదరాబాద్

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సౌర విద్యుత్, జలాశయాలపై తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభలో గురువారం ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, కసిరెడ్డి నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ప్రాజెక్టులకు సంబంధించి విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని - మిగతా3లో

## రిజిస్టర్డ్ పార్టీగా టీవీకే ఈసీ అధికారిక గుర్తింపు

- ప్రజలకు విజయ్ కృతజ్ఞతలు
- తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గుర్తింపు
- తమిళనాడు, పుదుచ్చేరిలో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా గుర్తింపు



# అంతరిక్షం అందరిదీ,.. బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి



అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు. 'శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది. వాతావరణ పరిస్థితుల అంచనా నుంచి పంటలు, సముద్రాలు, ప్రజల జీవనానికి సంబంధించిన అనేక అంశాల్లో అంతరిక్ష విజ్ఞానం కీలకంగా మారింది. అంతరిక్ష రంగంలో అవకాశాలు అపారమని, అదే సమయంలో బాధ్యత కూడా అందరిదే. కక్ష్యల్లో ఉపగ్రహాల సంఖ్య పెరుగుతున్న వేళ, సాంకేతికత మరింత శక్తిమంతంగా మారుతున్న సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారత్ అంతరిక్ష విధానం 'వసుధైవ కుటుంబకం' అనే భావనపై ఆధారపడి ఉంది. 'వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్' అనే స్ఫూర్తి ఇక భూగ్రహాన్ని దాటి అంతరిక్షానికి కూడా విస్తరించాలి. అంతరిక్షంలో లభించే శాస్త్రీయ సమాచారాన్ని పారదర్శకత, సమగ్రతతో మానవాళి ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలి' అని ప్రధాని మోదీ సూచించారు.

**రైతుల నుంచి మత్స్యకారుల వరకు ఇస్రో సేవలు**

భారత్ అంతరిక్ష ప్రయాణానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కేంద్రబిందువుగా ఉందని ప్రధాని తెలిపారు. అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యంతో పాటు తక్కువ వ్యయంతో విజయవంతమైన మిషన్లను నిర్వహిస్తూ ఇస్రో ప్రపంచ ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. ఇస్రో సాంకేతికతలు కేవలం అంతరిక్ష పరిశోధనలకే పరిమితం కాలేదని అన్నారు. రైతులకు వ్యవసాయ సమాచారం, మత్స్యకారులకు సముద్ర సంబంధిత సమాచారం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వంటి అనేక రంగాలకు అవి ఉపయోగపడుతున్నాయని వివరించారు. భారత రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కుపైగా ఉపగ్రహాలు అంతరిక్షంలోకి వెళ్లాయని ప్రధాని తెలిపారు. ఇస్రో సాంకేతికతలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు భారత్‌కే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ప్రయోజనం చేకూరుస్తున్నాయని చెప్పారు.

**2035లో భారతీయ అంతరిక్ష కేంద్రం**

2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని మోదీ తెలిపారు. 2040 నాటికి భారతీయుడిని చంద్రుడిపైకి పంపాలని ప్రణాళిక రూపొందించుకున్నట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించే పురోగతి ప్రయోజనాలు మానవాళి మొత్తానికి చేరాలన్నదే తమ మార్గదర్శక సూత్రమని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ అంతరిక్ష విజయాలను ప్రస్తావించారు ప్రధాని మోదీ. చంద్రయాన్-3 మిషన్? ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీప ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్? నిలిచిందని తెలిపారు. సూర్యుడిపై అధ్యయనం కోసం చేపట్టిన ఆదిత్య-ఎల్1 మిషన్ సూర్యుడి రహస్యాలను ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. గతేడాది ఓ భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారని గుర్తుచేశారు.

**ప్రైవేట్ రంగానికీ పెద్దపీట**

ఇస్రోతో పాటు దేశంలోని ప్రైవేట్ అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని మోదీ అన్నారు. వ్యాపార సంస్థల ఉత్సాహం, ఇస్రో సాంకేతిక నైపుణ్యంతో కలుస్తుండటంతో భారత అంతరిక్ష రంగంలో కొత్త శక్తి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇస్రోకు ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న విశ్వాసం వెనుక తరతరాల భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల కఠోర శ్రమ ఉందని ప్రధాని కొనియాడారు. ఒక్కో మిషన్ విజయంతో వారు ఇస్రోకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. భారత్ అంతరిక్ష కార్యక్రమం ప్రారంభమైన 1960ల నుంచే ఫ్రాన్స్ విశ్వసనీయ భాగస్వామిగా ఉందని మోదీ తెలిపారు. భూ పరిశీలన నుంచి ఆధునిక సాంకేతికతల వరకు ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. శాస్త్రీయ నైపుణ్యాన్ని మానవాళి ప్రయోజనాలతో అనుసంధానిస్తూ భారత్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత్ తదుపరి అంతరిక్ష ప్రయాణంలో ఫ్రాన్స్‌తో పాటు ప్రపంచ దేశాలు 'సహ ప్రయాణికులు'గా మారాలని ఆహ్వానించారు.

# రిజిస్టర్డ్ పార్టీగా టీవీకే ఈసీ అధికారిక గుర్తింపు



నటుడు నుంచి రాజకీయ నాయకుడిగా మారిన తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ ఎన్నికల సంఘం కీలక గుర్తింపు ఇచ్చింది. ఆయన నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)ను తమిళనాడు, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా ఈసీ గుర్తించింది. అంతేకాదు, పార్టీకి 'విజిల్' ఎన్నికల గుర్తును కేటాయించింది. ఈ పరిణామంపై సీఎం విజయ్? హర్షం వ్యక్తం చేశారు. పార్టీకి అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీవీకే రాజకీయ ప్రస్థానంలో ఇది కీలక మైలురాయిగా అభివర్ణించారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన టీవీకే, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను విజయ్ ప్రస్తావించారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ పార్టీ ఎదుగుదలను అపూర్వ అద్భుతంగా అభివర్ణించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు రావడం ద్వారా టీవీకేను అతిపెద్ద పార్టీగా ప్రజలు నిలబెట్టారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును గౌరవిస్తూ, ప్రజాస్వామ్య శక్తుల సహకారంతో నిజాయితీ, అవినీతి రహిత పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తమపై ప్రజల ఉంచిన నమ్మకాన్ని నిరంతర ప్రజాసేవ ద్వారా నిలబెట్టుకుంటానని తెలిపారు.

**'లౌకిక సామాజిక న్యాయమే మార్గం'**

రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే పాలన అందించడమే తమ లక్ష్యమని విజయ్? పేర్కొన్నారు. పారదర్శక పాలన, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సంక్షేమం తమ ప్రభుత్వ విధానాల్లో కీలకంగా ఉంటాయని స్పష్టం చేశారు. టీవీకే రాజకీయ సిద్ధాంత మార్గంలో లౌకికి సామాజిక న్యాయంకు ప్రాధాన్యత ఉంటుందని విజయ్? తెలిపారు. ఈ లక్ష్యంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తామని చెప్పారు. పార్టీ తొలి ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయడంలో కీలకంగా పనిచేసిన తమిళ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, ప్రచార నిర్వాహకులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.


2024లో పార్టీని ప్రారంభించారు విజయ్. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు విజిల్? గుర్తు ఈసీ కేటాయించింది. ఇప్పుడు ఎన్నికల్లో సాధించిన ఘన విజయంతో అదే గుర్తును శాశ్వతంగా ఖరారు చేసింది. దీంతో ఇకపై జరిగే ఏ ఎన్నికల్లోనైనా ఇదే గుర్తుపై టీవీకే పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడు ఇప్పటికే డీఎంకే , ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, డీఎండీకే వంటి పార్టీలు అధికారిక గుర్తింపు పొందాయి. తాజాగా విజయ్? పార్టీ టీవీకే కూడా ఆ వాటి సరసన చేరింది. దీంతో రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరింది.

**విజయ్ నాయకత్వంలో కూటమి**

ఇదిలా ఉండగా బుధవారం టీవీకే నేతృత్వంలో కొత్త కూటమి ఆవిర్భవించింది. దీనికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్"అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న టీవీకే ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, తమిళనాడు హక్కుల పరిరక్షణ లక్ష్యాలుగా ఈ కూటమి పనిచేస్తుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. రానున్న ఉప ఎన్నికల్లో కొత్త కూటమి పేరుతో ఉమ్మడిగా పోటీ చేస్తామని ప్రకటించారు. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) నాయకులు హాజరయ్యారు. కొత్త కూటమిలో టీవీకేతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ ఉన్నాయి. కూటమి భవిష్యత్ సంస్థాగత నిర్మాణం, ఉమ్మడి కార్యక్రమం, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయ వ్యవస్థ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు.

# ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..

ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను




స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..



చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## 18 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగం



సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికలను వినియోగించే పిల్లల భద్రతకు మరింత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్?ఫామ్?లు నేరుగా ఒప్పందాలు చేసుకోకుండా తగిన నియంత్రణలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం, కేంద్రం, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. భారత్‌లో కొన్ని రక్షణ చర్యలు అవసరమని విచారణ సందర్భంగా ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది.

'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు ఈ పిటిషన్?ను దాఖలు చేసింది. సంస్థ తరపున సీనియర్ న్యాయవాది హెచ్?ఎస్? ఫూల్కా వాదనలు వినిపించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వయసు నిబంధనలు, భారత చట్టాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పిటిషన్?లో ప్రధానంగా ప్రస్తావించారు. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి కొన్ని వేదికలు 13 ఏళ్ల వయసు నుంచే ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పిస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లలోపు వారంతా మైనర్లుగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలు డిజిటల్ వేదికలపైకి ప్రవేశించినప్పుడు వారి వయసును సక్రమంగా నిర్ధారించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడం, ప్రమాదకర కంటెంట్ నుంచి వారిని కాపాడటం వంటి అంశాలపై స్పష్టమైన నియమాలు అవసరమని పిటిషన్ పేర్కొంది.

**సీఎస్ఏఎం కట్టడికి మరింత పటిష్ఠ చర్యలు**

చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్ (జూజూావీ)కు సంబంధించి దేశంలో కఠినమైన శిక్షా నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా అమలు చేయడంలో డిజిటల్ వేదికలు విఫలమవుతున్నాయని పిటిషన్‌లో ఆరోపించారు. పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టరింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలని, అలాగే వినియోగదారుల వయసును నిర్ధారించే సమర్థమైన విధానం ఉండాలని కోరారు.

**తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేయాలని పిటిషన్**

18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండా నిబంధనలు రూపొందించాలని పిటిషన్ కోరింది. మైనర్ డిజిటల్ సేవలను వినియోగించాల్సిన పరిస్థితి ఉంటే తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకుడి అనుమతి తప్పనిసరి చేయాలని సూచించింది. అలాంటి అనుమతి ఇచ్చే వ్యక్తి నిజంగా తల్లిదండ్రి లేదా చట్టబద్ధ సంరక్షకుడేనా అన్నది గుర్తింపు ధ్రువీకరణ లేదా ఈ-కేవైసీ ద్వారా నిర్ధారించే విధానం ఉండాలని కోరింది. ఇందుకోసం 2021లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమాల్లో మార్పులు చేయాలని లేదా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

బాలల కిడ్నాప్ కేసుల దర్యాప్తుకు దేశవ్యాప్తంగా ఒకే విధానం

అలాగే పిల్లల కిడ్నాప్?, అపహరణ కేసుల దర్యాప్తుపై దాఖలైన మరో ప్రజాప్రయోజన వ్యాజ్యంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. ఇలాంటి కేసుల దర్యాప్తు కోసం దేశవ్యాప్తంగా ఒకే విధమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్?పై కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు మంత్రిత్వ శాఖలకు నోటీసులు జారీ చేసింది. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అడ్వొకేట్ ఆన్ రికార్డ్ అశ్వని కుమార్ దూబే ద్వారా పిటిషన్ సమర్పించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. పిల్లలు కనిపించకుండా పోయినప్పుడు, కిడ్నాప్ లేదా అపహరణకు గురైనప్పుడు పోలీసులు వెంటనే స్పందించేలా ప్రత్యేక విధానం రూపొందించాలని పిటిషన్ కోరింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఒకే తరహా స్టాండర్డ్ ప్రశ్నావళి, ప్రత్యేక దర్యాప్తు విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేసింది. కిడ్నాప్, అపహరణ కేసుల దర్యాప్తును కనీసం ఏసీపీ లేదా ఎస్‌హెచ్‌వో స్థాయి అధికారి పర్యవేక్షించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. కేసుల దర్యాప్తును నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసేలా వ్యవస్థ ఉండాలని పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తులో జాప్యం జరిగితే అపహరణకు గురైన చిన్నారులను సురక్షితంగా గుర్తించి తిరిగి తీసుకురావడంలో అవకాశాలు తగ్గుతాయని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో పిల్లలు అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, బలవంతపు శ్రమ, అక్రమ దత్తత వంటి ప్రమాదాలకు గురయ్యే ముప్పు పెరుగుతుందని తెలిపారు. కిడ్నాప్, అపహరణ కేసుల వేగవంతమైన విచారణ కోసం ఎంపీలు, ఎమ్మెల్యేల కేసుల విచారణకు ఉన్న ప్రత్యేక కోర్టుల తరహాలో ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలని పిటిషన్ కోరింది. ఇలాంటి కేసులను ఏడాదిలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# ఫ్యూచర్ లేని సిటీ...

రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్ సిటీ ఓ మిథ్య అని, దానికి ఎలాంటి ఫ్యూచర్ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూముల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు చెల్లవని, ఫ్యూచర్ లేని సీఎం..తన సోదరులతో కలిసి ఆడుతున్న రియల్ ఎస్టేట్ నాటకంలో బలిపశువులు కావొద్దని విజ్ఞప్తి చేశారు. 'పెట్టుబడులు పెట్టి మోసపోవొద్దు. ఏటా రూ.లక్ష కూడా టర్నోవర్ లేని సీఎం సోదరుడు కొండల్‌రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ కంపెనీకి రూ.250 కోట్లు విలువ చేసే భూములను రూ.7 కోట్లకే కట్టబెట్టడంపై కోర్టులను ఆశ్రయిస్తాం. ఎనుముల అన్నదమ్ముల దోపిడీని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలిపెట్టబోం..'అని అన్నారు. గురువారం మహేశ్వరం మండలం తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ (ఈసిటీ)లో టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూములను బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. ఆ కంపెనీకి భూ కేటాయింపులపై నిరసన వ్యక్తం చేసింది. అనంతరం పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మాట్లాడారు.




**ఇందులో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి..**

'ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయాజాలం నడుపుతోంది. వాస్తవానికి ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగింది. ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగించడం చట్టపరంగా ప్రశ్నార్థకం. ఫ్యూచర్ సిటీ భవిష్యత్తుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. రేపు కోర్టులో ఈ భూములపై వివాదాలు తలెత్తితే నష్టపోయేది పారిశ్రామికవేత్తలే.

**పూర్తి వివరాలు ప్రజల ముందుంచాలి**

ఈ భూ కేటాయింపుపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలి. సీఎం కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా? ప్రయోజనాల సంఘర్షణ కాదా? కుటుంబ పాలన కాదా? ఒకవైపు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి.. మరోవైపు పారిశ్రామికవేత్త ఎనుముల జగదీశ్వర్‌రెడ్డిల మధ్య రూ.1,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం. దానికి మళ్లీ ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ భూములు, మినహాయింపులు ఇవ్వాలా? సీఎం సోదరుడి సంస్థ ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

**బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదు?**

అనామక కంపెనీకి విలువైన భూములు కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదు? ఈడీ, ఐటీ, సీబీఐలు మాపై కేసులు పెట్టడానికే ఉన్నాయా? అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు వారికి ఎందుకు కనిపించడం లేదు? తెలంగాణ..కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందని ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఆరోపిస్తున్నారు. తెలంగాణను కొల్లగొడుతున్నారని ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోం మంత్రి ఎక్కడున్నారు? ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయి. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గర గా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలి.

**సామాన్యులకు కూడా ఇలాగే భూములు ఇస్తారా?**

భూ కేటాయింపుల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తే సామాన్యులు, యువత, రైతులకు కూడా ఇదే తరహాలో ప్రభుత్వ భూములు, రాయితీలు ఇవ్వాలి. మేము లక్ష రూపాయల మూలధనంతో పెట్టుబడి పెడతామని వస్తే కోట్ల విలువైన స్థలం ఇస్తారా? మాకు కూడా ఇదే రాయితీలు, మినహాయింపులు ఇస్తారా? ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలిపెట్టబోం. అవసరమైతే ప్రజా కోర్టును ఆశ్రయిస్తాం, రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలకు వివరిస్తాం..'అని కేటీఆర్ అన్నారు.

# 'సర్'తో ప్రమాదం!



-మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా పరిగణించాలని, అర్హులైన వారి ఓటు హక్కును కాపాడాలని సూచించారు. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశం జరిగింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబుతో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ భేటీలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే మాజీ ఎమ్మెల్యేలు కొమ్మిది నరసింహారెడ్డి, వంగా సుబ్బారావు, జి.సిద్ధయ్యల మృతికి సీఎల్పీ సంతాపం తెలిపింది. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు.

'ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా చూపెడుతున్నారు. కానీ ఓటర్ల సంఖ్య మాత్రం 88 కోట్లే అంటున్నారు. అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి. ఈ 15 కోట్ల ఓట్ల తొలగింపు కారణంగా పొంచి ఉన్న ప్రమాదాన్ని అంచనా వేయగలగాలి. ఆ ప్రమాదం మన దరిదాపులకు రానీయకుండా మీరే జాగ్రత్త పడాలి. మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరు మీ గెలుపోటములను ప్రభావితం చేస్తుంది. ఎస్ఐఆర్ కోసం నేను రెండు రోజులు కొడంగల్‌లోనే ఉన్నా. ఎమ్మెల్యేలందరూ అలానే ఫోకస్ పెట్టాలి. తెలంగాణలో జరిగిన జనగణన దేశానికి రోల్‌మోడల్. రాష్ట్ర నమూనాను దేశ వ్యాప్తంగా జనగణనలో చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

**అధికారం పోయినా అహంకారం పోలేదు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి రాష్ట్ర ప్రజలకు వివరించాలి. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తుంటే ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన సభ జరగకుండా కుట్ర చేశారు. అధికారం పోయినా వారికి అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి మూడు రోజుల పాటు సభ సజావుగా జరగకుండా చేశారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించారు. మహిళా అధికారుల ముందు టీ షర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. దళితులు నిరసన తెలిపేందుకు వెళ్లిన నేలను శుద్ధి చేసి అవమానపర్చారు. అయినా ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టడంతో పాటు ఆ కుట్రను ప్రజలకు తెలియజేయగలిగాం..'అని సీఎం అన్నారు. కుట్రను తిప్పికొట్టారంటూ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అభినందించారు.

**అసెంబ్లీలో పనితీరు ఆధారంగానే పదోన్నతులు**

'అసెంబ్లీలో జరిగిన ఘటనల గురించి ఫ్లాష్ సర్వే చేయించా. అందులో కాంగ్రెస్‌కు చాలా పాజిటివ్‌గా వచ్చింది. మనం ఏం చేస్తున్నామో ప్రజలు గమనిస్తుంటారు. కాంగ్రెస్ సభ్యులు లాబీల్లో తిరగడం కాదు. అసెంబ్లీలో హాజరు తగ్గకుండా చూసుకోవాలి. సభ జరిగినన్ని రోజులు ఖచ్చితంగా హాజరు కావాలి. చర్చల్లో పాల్గొనాలి. నియోజకవర్గాల సమస్యలు ప్రస్తావించాలి. ప్రజలిచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించలేరు. అసెంబ్లీలో పనితీరు ఆధారంగానే పదోన్నతులు వస్తాయి. సభలో అందరికీ వెసులుబాటుగా ఉండడం కోసం అత్యంత చారిత్రక భవనంలో శాసనమండలి నిర్వహిస్తున్నాం. అసెంబ్లీలో దుద్దిళ్ల శ్రీపాదరావు పేరిట సెంట్రల్ హాల్ ఏర్పాటు చేశాం.

**22ఏలో కోటి ఎకరాలు అవాస్తవం**

22ఏ అనేది అభూత కల్పన మాత్రమే. ఈ జాబితాలో కోటి ఎకరాలు ఉన్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఉన్న భూములే ఇప్పుడూ ఉన్నాయి. ప్రైవేటు వివాదాలున్నవి కేవలం 3 లక్షల ఎకరాలు మాత్రమే. ధరణిలో భారీ ఎత్తున అరాచకాలు చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే బీఆర్ఎస్ నేత ఒకరి పేరిట వెయ్యి ఎకరాలు ఎక్కించుకున్నారు. వీటన్నింటిపైనా విచారణ చేయిస్తున్నాం. అన్నీ ఒకొక్కటిగా బయటకు వస్తాయి. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సహకారంతోనే దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఎల్‌నినో కారణంగా వచ్చే 10 నెలలు కూడా ఇబ్బంది ఉంటుంది. కరువు వచ్చే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యేలు సాగునీటిపై కాకుండా తాగునీటిపై ఫోకస్ చేయాలి. కొందరు కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎదిగి అదే కాంగ్రెస్ పార్టీకి నష్టం చేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలు రాష్ట్ర స్థాయి నేతలుగా ఎదిగేవారా?'అని సీఎం ప్రశ్నించారు. వెయ్యి రోజుల పాలనకు సహకరించిన సీఎల్పీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

**ఇంటింటికీ పథకాల ప్రచారం జరగాలి: భట్టి విక్రమార్క**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సభ్యులందరం కలిసి పనిచేస్తే కుట్రలను ఎలా ఛేదించగలమో చేసి చూపించామని అన్నారు. బీఆర్ఎస్ నేతల తీరు, వారి భాష, వివక్ష పూరిత కార్యకలాపాల గురించి రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేసి కట్టడి చేయగలిగామని అన్నారు. అందరం ఒకటే మాట, ఒకటే బాటగా ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేసుకోవడంలో వెనుకబడుతున్నామన్నారు. సరైన విధంగా ప్రచారం చేసుకుంటే ఆ ప్రవాహంలో ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం చేసిన పనులను ప్రతి గ్రామంలో ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు.

**తెలంగాణలోనే సామాజిక న్యాయం: పీసీసీ చీఫ్**

సామాజిక న్యాయం తెలంగాణలోనే అమలవుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ బీసీ కాకపోయినా బీసీలకు రిజర్వేషన్ల కోసం ముందుకొచ్చారని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం సహకరించడం లేదని విమర్శించారు. కాగా రాష్ట్రంలో పరిస్థితులను పలువురు మంత్రులు సీఎల్పీకి వివరించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి సమస్యపై మంత్రి ఉత్తమ్, జనగణనలో బీసీ కాలమ్ గురించి పొన్నం, 22ఏ భూముల జాబితా గురించి పొంగులేటి, పాలిటెక్నిక్ విద్యార్థుల అంశంపై మంత్రి వివేక్‌లు వివరించారు.

**యాష్కీకి సీఎం శుభాకాంక్షలు**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎంపికైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం సీఎల్పీ సమావేశం అనంతరం.. అసెంబ్లీ కమిటీ హాల్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు యాష్కీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నినాదాల హోరు.. పాటల జోరు

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, వాణీదేవి, నవీన్‌రావు తదితరులు వెల్‌వైపు దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు. ప్లకార్డులు తీసేయాలని చైర్మన్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా వెనక్కి తగ్గలేదు.

**నినాదాల హోరు**

'కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడదాం..ముఖ్యమంత్రి భూ దోపిడీ నశించాలి..సీఎం కుటుంబ సభ్యులకు కేటాయించిన భూములను రద్దు చేయాలి..22ఏ నిషేధిత భూముల అంశంపై వెంటనే చర్చ చేపట్టాలి..'అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదా లు చేశారు. వారు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లకుండా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ సమయంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకున్నారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే సభ మర్యాద పాటిస్తూ నిబంధనలు పాటించాలని సూచించారు. మరోవైపు ప్రశ్నోత్తరాలు కొనసాగించడంతో బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దే నిలబడి తమ నిరసన కొనసాగించారు. దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు, సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నిరసన పాట లు పాడారు. దీనికి మిగిలిన ఎమ్మెల్సీలు చ ప్పట్లతో కోరస్ ఇచ్చారు. దీంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. చైర్మన్ వారించినా బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. అయినా ప్రశ్నోత్తరాలను కొనసాగించారు.

**నినాదాల కాగితం ప్రదర్శించిన శంభీపూర్ రాజు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.. తీన్మార్ మల్లన్న పక్క సీటులోకూర్చుని అకస్మాత్తుగా తన జేబులోంచి 'బామ్మర్దికి అమృత్ టెండర్లు, తమ్ముడికి రావిరాల భూములు.. రైజింగ్ ఎనుముల ఫ్యామిలీ'అని నినాదాలు రాసి ఉన్న కాగితాన్ని ప్రదర్శించారు. దీనిపై చైర్మన్ గుత్తా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు తమ స్థానాల్లో కూర్చుంటే ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై చర్చించే అవకాశం ఇస్తానని ప్రకటించారు. కాసేపటి తర్వాత ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో..22ఏ అంశంపై బీఆర్ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు.

## జల విద్యుత్ ప్రాజెక్టులపై సోలార్ విద్యుత్

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కుమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు వ్యయం ఎక్కువ అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినా, అందులో కొన్ని ఇబ్బందులున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని భట్టి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు 15 వేల మెగావాట్లు గరిష్ట డిమాండ్ ఉంటే, ఈ నెల 9వ తేదీన అది 19 వేల మెగావాట్లకు చేరిందన్నారు.

**సోలార్ గ్రిడ్ ఏర్పాటు**

అమ్రాబాద్‌లో సోలార్ పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి వెల్లడించారు. 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం'పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## వైఎస్ పేదల కోసం గుర్తించిన స్థలాలు నెల రోజుల్లో ఇస్తాం



**హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేదలకు ఇవ్వడానికి గుర్తించిన ప్రభుత్వ స్థలాలను లేఅవుట్ చేసిన వాటిని నెల రోజుల్లో పేదలకు ఇచ్చే ప్రయత్నం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అంశాన్ని పలువురు సభ్యులు లేవనెత్తారు. సభ్యుల సందేహాలకు మంత్రి సమాధానమిస్తూ, 2024లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసి, ఆవాస్ యోజన అర్హత కలిగిన 11,56,929 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. ఇది ఇప్పటికే పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. భవిష్యత్‌లో అర్హులకు మూడు, నాలుగో విడతలో కూడా ఇళ్లు ఇవ్వాలని ఆలోచిస్తోందని తెలిపారు.

**సమస్యలున్నాయి: రాజగోపాల్‌రెడ్డి**

చిన్న చిన్న కారణాల వల్ల అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బతుకు దెరువు కోసం వాహనాలు కొనుక్కొన్నారని, అవి ఎప్పుడో పోయాయని, వారిని అనర్హులను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఇళ్లు ఇస్తున్నామనేది కాదని, ఎంతమంది అర్హులకు ఇస్తున్నామన్నదే ముఖ్యం కావాలన్నారు. చర్చలో మనోహర్‌రెడ్డి, అక్బరుద్దీన్, మేడేపల్లి సత్యం, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

**అగ్రి పాలిటెక్నిక్ కాలేజీలను మెరుగుపరుస్తాం: మంత్రి తుమ్మల**

రాష్ట్రంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునీకరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 11 ప్రైవేటు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రభుత్వం తనిఖీలు నిర్వహించిందని, ఇందులో ఆరు ప్రైవేటు కాలేజీల అనుబంధాన్ని రద్దు చేశామన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. ప్రమాణాలు లేని కాలేజీల అనుమతి రద్దు చేశామని, కొన్ని కాలేజీల్లో ప్రమాణాల పరిశీలనకు ఓ కమిటీని వేశామన్నారు. ఈ చర్చలో పాల్గొన్న ఎమ్మెల్యే మదనమోహన్ మాట్లాడుతూ, సరైన ప్రమాణాలు లేకుండా వ్యవసాయ కాలేజీలకు అనుమతి ఇవ్వొద్దని చెప్పారు.అవసరమైన ఫ్యాకల్టీ ఉండాలని కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. కొత్త వంగడాలు, సరికొత్త వ్యవసాయ విధానాలపై ఆధునిక లేబొరేటరీలతో పరిశోధనలు జరగాలని మధుసూదన్‌రెడ్డి కోరారు. చర్చలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కూడా పాల్గొన్నారు.

**హజ్‌హౌస్‌పై స్పష్టత ఇవ్వాలి: అక్బర్**


హజ్‌హౌస్‌లో సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు. ఇతరులను మనం అనుసరించాల్సిన అవసరం లేదని, బెంగళూరులోని హజ్‌హౌస్‌ను ఉద్దేశించి అన్నారు. పహాడీషరీఫ్ వద్ద కొత్త హజ్‌హౌస్ నిర్మాణంపై అక్బర్ పలు ప్రశ్నలు వేశారు.

# సంపాదకీయం

## షెల్ పార్టీల దందా

షెల్ కంపెనీల గురించి చాలా మంది వింటారు. కానీ షెల్ రాజకీయ పార్టీలు కూడా ఉంటాయి. సేఫ్ గా అక్రమ సొమ్మును చెలామణిలోకి తెచ్చుకోవడానికి ఈ పార్టీలు ఉపయోగపడతాయి. పార్టీలు నమోదవుతాయి. ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఉండరు, ప్రజల్లో ఉనికి ఉండదు, ఆఖరుకు కార్యాలయాలకు తాళాలు వేసి ఉంటాయి.. కానీ వేల కోట్ల రూపాయల చందాలు మాత్రం ఈ పార్టీలకు అందుతూ ఉంటాయి. షెల్ రాజకీయ పార్టీలు అంటే కేవలం కాగితాల మీద మాత్రమే ఉంటూ, ఎలాంటి నిజమైన రాజకీయ లేదా ఎన్నికల కార్యకలాపాలు నిర్వహించకుండా, ప్రధానంగా పన్ను మినహాయింపులు, మనీలాండరింగ్ కోసం ఉపయోగపడే నకిలీ లేదా నిష్క్రియ రాజకీయ పార్టీలు2023-24 ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే గుజరాత్‌కు చెందిన ఆరు గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఏకంగా రూ. 1,700 కోట్ల విరాళాలు లభించాయి. దేశంలోని ఐదు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, ఆప్, బిఎస్పి, సిపిఎం, ఎన్పీపీలన్నీ కలిసి సేకరించిన మొత్తం విరాళాలు రూ. 1,480 కోట్లు కన్నా ఈ ఆరు అనామక పార్టీల నిధులే ఎక్కువ. సాధారణంగా షెల్ కంపెనీలను పెట్టి నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునే అక్రమార్కులు, ఇప్పుడు ఇన్కమ్ టాక్స్ మినహాయింపులు లభించే రాజకీయ పార్టీలను షెల్ పార్టీలు గా మార్చేసి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు.ఇందులో అత్యంత ఆందోళనకరమైన విషయం ఏంటంటే.. ఏకంగా రూ. 620 కోట్లకు పైగా విరాళాలు పొందిన ఆమ్ జనమత్ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసింది కేవలం ఒక్కటంటే ఒక్క స్థానంలో మాత్రమే! అటు నాలుగైదు పార్టీల చిరునామాలు అహ్మదాబాద్‌లోని నరోడా అనే ఒకే ఒక్క ప్రాంతంలో కేంద్రీకృతమై ఉండటం, ఆఫీసులన్నీ ఖాళీగా ఉండటం చూస్తుంటే ఇవి పక్కా వ్యూహంతో నడుస్తున్న హవాలా ముఠాలనే అనుమానాలు బలపడుతున్నాయి. ప్రజారోగ్యం, ప్రజా సంక్షేమం పేరుతో వందల కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, దానికి సంబంధించిన ఎటువంటి బ్యాంక్ స్టేట్‌మెంట్లు లేదా అధికారిక ఆధారాలు లేకపోవడం ఈ షెల్ నెట్‌వర్క్ అసలు రంగును బయటపెడుతోంది.గతంలో 2019 నుండి 2024 మధ్య కాలంలో గుజరాత్‌కు చెందిన 10 అనామక పార్టీలు రూ. 4,300 కోట్లు సేకరించినట్లుగా నివేదికలు ఉన్నాయి. అంటే దేశీయంగా పన్ను ఎగవేతదారులు, కార్పొరేట్ దందాలు నడిపే మూకలు , నల్లధన తిమింగలాలు తమ అక్రమ సంపాదనను సురక్షితంగా రౌండ్-ట్రిప్పింగ్ చేయడానికి, ఎన్నికల నిధుల పేరుతో చట్టపరమైన రక్షణ పొందడానికి ఈ షెల్ పొలిటికల్ పార్టీలను ఒక లాండరింగ్ ఏజెంట్లుగా వాడుకుంటున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమైన ఎన్నికల వ్యవస్థను, పన్ను మినహాయింపు చట్టాలను ఆసరాగా చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులనే తొలుస్తున్న ఈ వ్యవహారం ముమ్మాటికీ ఆర్థిక నేరమే.దేశంలో ఉన్న 2,700 పైచిలుకు పార్టీల కార్యకలాపాలపై కేంద్ర ఎన్నికల కమిషన్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఆదాయపు పన్ను శాఖలు తక్షణమే ఉమ్మడి విచారణ జరపాల్సిన అవసరం ఉంది. సుప్రీం కోర్టుతీర్పురాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి షెల్ కంపెనీలను ఉపయోగించే అవకాశంపై భారత ఎన్నికల సంఘం వ్యక్తం చేసిన ఆందోళనలను కారణంగా చూపుతూ, ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేశారు.2017లో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా షెల్ కంపెనీలుగా పేర్కొన్న 300కు పైగా సంస్థల జాబితాలో ఉన్న కనీసం నాలుగు సంస్థలు, 2013-14 మరియు 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య బీజేపీకి నేరుగా మొత్తం రూ. 4.94 కోట్లు విరాళంగా ఇచ్చాయని న్యూస్‌లాండ్రీ ఇప్పుడు కనుగొంది.వాటిలో రెండు షెల్ సంస్థలుగా జాబితా చేయబడక ముందే బీజేపీకి విరాళాలు ఇవ్వగా, వ్యాపార ఆంక్షలు విధించబడిన సెబీ షెల్ కంపెనీల జాబితా నుండి ఆ నాలుగు సంస్థలను ఇంకా తొలగించలేదు.దాదాపు ఒక నెల తర్వాతనివేదించబడిందిగత ఐదు ఆర్థిక సంవత్సరాలలో 30 కంపెనీలు బీజేపీకి రూ. 335 కోట్ల విరాళాలు ఇవ్వడానికి, కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలకు మధ్య సంబంధం ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఇప్పుడు మేము మరో 11 కంపెనీలను కనుగొన్నాము ? ఇవి 2016-17 నుండి 2022-23 వరకు బీజేపీకి రూ. 62.27 కోట్లు విరాళాలు ఇచ్చి, అదే కాలంలో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలను ఎదుర్కొన్నాయి.నిధుల మూలాలను శోధించకుండా, క్షేత్రస్థాయిలో ఉనికి లేని ఇటువంటి బోగస్ పార్టీల గుర్తింపును రద్దు చేయడంతో పాటు, రాజకీయ నిధుల పేరుతో సాగుతున్న ఈ శ్వేతపత్ర ఆర్థిక ఉగ్రవాదానికి చట్టపరమైన కఠిన చర్యల ద్వారా శాశ్వత ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్న అభిప్రాయం వినిపిస్తోంది. దాతలు ఈ పార్టీలకు కోట్ల రూపాయల విరాళాలు ఇచ్చినట్లు చూపించి ఐటీ మినహాయింపు పొందుతారు. ఆ తర్వాత సదరు పార్టీ నిర్వాహకులు కొంత శాతం 'సర్వీస్ చార్జ్' (కమిషన్) మినహాయించుకుని, మిగిలిన నగదును దాతలకు తిరిగి ఇచ్చేస్తారని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు

# నిరంకుశత్వంపై ధర్మాగ్రహం




ఒకసారంటూ జనం ఓట్లతో గద్దెనెక్కాక ఇష్టారాజ్యంగా పాలించవచ్చునని భావించే పాలకులకూ, వారి అడుగులకు మడుగులొత్తే ఉన్నతాధికారులకూ అలహాబాద్ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. అక్రమమో, సక్రమమో... ఒక కేసులో అరెస్టయ్యాక, పాలకులు తల్చుకుంటే ఎన్నాళ్లయినా చెరసాలపాలు కాకతప్పదన్న భయాందోళనలు ప్రజల్లో వ్యాపింపజేయటానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఆ జాడ్యం మరింత ముదిరింది. జనాన్ని సంఘటితపరిచే వారితో కఠినంగా వ్యవహరిస్తే ఇతరులు బెదిరిపోతారనీ, అంతా 'పరిష్కారం' అవుతుందనీ ప్రభుత్వాలనుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ న్యాయస్థానాల వైఖరెలా ఉండాలో, ప్రాథమిక హక్కుల అమలుకు ఎంతగా ప్రాధాన్యమివ్వాలో జస్టిస్ అతుల్ శ్రీధరన్, జస్టిస్ అచల్ సచ్‌దేవ్‌లతో కూడిన ధర్మాసనం చూపించింది. ఈ నిరసనల్లో పాల్గొన్న న్యాయశాస్త్ర విద్యార్థిని ఆకృతి చౌధరీపైనా, మరికొందరిపైనా మొన్న ఏప్రిల్‌లో జాతీయ భద్రతా చట్టాన్ని (ఎన్ఎస్ఏ) ప్రయోగించి గౌతమ్ బుద్ధనగర్ జిల్లాలోని కస్నా జైలుకు పంపారు. తగిన కారణం లేకుండా, ఏకపక్షంగా ఎన్ఎస్ఏ వంటి కఠినమైన చట్టాన్ని ప్రయోగించటంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసి, ఆమెకు రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలనీ, ఈ మొత్తాన్ని జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్) మొదలు పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి వరకూ అందరి జీతాల్లోనూ కోతబెట్టి అందించాలనీ ఆదేశించింది.

కేసు పూర్వాపరాలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీ కార్మికులకు రోజూ 10 నుంచి 12 గంటలు పనిచేస్తే నెలకు రూ. 10,000 నుంచి రూ. 13,000 వరకూ వేతనం లభిస్తుంది. హరియాణాలోనూ, దాని పరిధిలోకొచ్చే పొరుగునున్న గురుగ్రామ్‌లోనూ ఈ తరహా కార్మికుల కనీస వేతనాన్ని 35 శాతం పెంచి రూ. 15,000గా నిర్ధారించారు. తమకూ వేతనాలు పెంచాలనీ, అది రూ. 20,000వరకూ ఉండాలనీ నోయిడా కార్మికులు డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగారు. ఇందులో ఏం వైపరీత్యం ఉంది? వారు డిమాండ్ చేసినంతా ఇవ్వటం సాధ్యం కాకపోవచ్చు. చర్చలకు పిలిస్తే కలిగే నష్టమేమిటి? ఈ కార్మికులకు వేతనం ఒక్కటే సమస్య కాదు. నియామక పత్రాలుండవు కనుక అదనపు చాకిరీకి అదనంగా ఏమీ రాదు. వారాంతపు సెలవులుండవు. పీఎఫ్, ఆరోగ్య బీమా వంటివి లేవు. నిర్దిష్టంగా ఒక తేదీకి వేతనాలు, భద్రతా ప్రమాణాలు కనబడవు. మహిళా కార్మికుల స్థితి మరింత ఘోరం. కార్మికులకొచ్చే వేతనాల్లో కాంట్రాక్టర్ల అక్రమ కోతలు సరేసరి. 58.2 శాతం మందికి అసలు నియామక పత్రాలే లేవు. 47 శాతం మందికి వేతనంతో కూడిన సెలవు లేదు. అరకొరగానైనా రోజులు గడిచినంత కాలం ఎవరూ ప్రశ్నించలేదు. కానీ గడ్డురోజులు దాపురించాక మౌనంగా ఉండలేకపోయారు. ఇవన్నీ ప్రభుత్వ పెద్దలకు తెలియదని కాదు. అయినా ఎడాపెడా కేసులు పెట్టి జైళ్లకు పంపితే అంతా సమసిపోతుందని భావించారు. ఆకృతి తదితరులు నిరసనలో హింసకు కుట్ర పన్నారని, జనాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని చెప్పడానికి వాట్సాప్ మెసేజ్‌లు లేదా ఇతరత్రా ఆధారాలు చూపలేకపోయారని ధర్మాసనం వ్యాఖ్యానించటం గమనార్హం. న్యాయమైన కోర్కెల్ని శాంతియుతంగా తెలపడానికి శాంతిభద్రతలకు విఘాతం సాకుతో అవకాశం ఇవ్వకపోవటం నిరంకుశ పాలనకు దారితీస్తుందని అభిప్రాయపడింది. విధుల్ని సక్రమంగా నిర్వర్తించే అధికారుల్నీ, పోలీసులనూ జనం దేవతలే అసూయ పడేంతగా నెత్తినపెట్టుకుంటారనీ, అక్రమ చర్యలకు పాల్పడితే అందుకు విరుద్ధమైన ఫలితాలొస్తాయనీ హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్ ఒక్కటే కాదు... పలు రాష్ట్రాల్లో పోలీసులు అధికార పార్టీకి తొత్తుల్లా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ నేతలనూ, కార్యకర్తలనూ, సామాజిక మాధ్యమాల బాధ్యులనూ అక్రమ కేసులతో వేధిస్తున్నారు. నెలల తరబడి జైళ్లపాలు చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఎన్నిసార్లు చీవాట్లు పెట్టినా మార్పు లేదు. కానీ ఎల్లకాలమూ ఇది సాగదు. ఇదే వరస కొనసాగితే ఏపీలోనూ కఠిన చర్యలు తీసుకునే స్థితి ఏర్పడుతుంది. అప్పుడు పాలకులూ, వారి రెడ్ బుక్‌లూ అధికారుల్ని రక్షించటం అసాధ్యం.

# మొదలైనచోటే ముగిసిన వివాదం!



హైదరాబాద్ నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల వివాదం సుప్రీంకోర్టులో మొదలై అక్కడే ముగిసింది. లా విద్యార్థుల మీద, టీచింగ్ సిబ్బంది మీద క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు లేదని సుప్రీంకోర్టు సెప్టెంబరు 3న తీర్పు చెప్పింది.

సెప్టెంబరులో జరగాల్సిన నల్సార్ లా యూనివర్సిటీ కాన్వొకేషన్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించారు. ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా పట్టాలు తీసుకోవడం న్యాయశాస్త్ర విద్యార్థులకు గొప్ప అవకాశం. కానీ నల్సార్ విద్యార్థులు దానికి అభ్యంతరం చెప్పారు. జస్టిస్ సూర్యకాంత్‌కు రాజ్యాంగ ప్రధాన విలువల మీద గౌరవం లేదనీ, అలాంటివారి చేతుల మీదుగా తాము పట్టాలు తీసుకోబోమనీ అన్నారు. దీంతో యూనివర్సిటీ జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించే ఆలోచనను విరమించుకుంది. కానీ, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు వ్యతిరేకంగా విద్యార్థులు నిరసనలు తెలపడం పట్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) తీవ్రంగా స్పందించింది. ఈ ఏడాది నల్సార్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రులైన వారిని దేశంలో ఏ బార్ అసోసియేషన్?లోనూ నమోదు చేసుకోరాదని బీసీఐ అధ్యక్షులు మానన్ కుమార్ మిశ్రా తీవ్రమైన ఉత్తర్వు జారీచేశారు. మానన్‌కుమార్ మిశ్రా బీజేపీకి సన్నిహితులు. బీసీఐ అధ్యక్ష పదవిలో పదేళ్లుగా నిరాఘాటంగా కొనసాగుతున్న వారు. రెండేళ్ల క్రితం బిహార్ నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభకు కూడా ఎన్నికయ్యారు. జస్టిస్ సూర్యకాంత్ పరువును కాపాడే లక్ష్యంతో మానన్‌కుమార్ మిశ్రా ఈ వినూత్న ఉత్తర్వులు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఈ ఉత్తర్వులు రాగానే, సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్‌తో సహా, దేశంలోని ప్రజాస్వామికవాదులంతా మానన్‌కుమార్ మిశ్రా నిర్ణయం మీద తీవ్రంగా స్పందించారు. నిరసనలు పెరగటంతో బీసీఐ తన ఉత్తర్వుల్ని ఉపసంహరించుకుంది. అయినప్పటికీ ఆ వివాదం ముగియకుండా మరికొన్ని ఆసక్తికర మలుపులు తిరిగింది. నల్సార్ యూనివర్సిటీ పూర్వవిద్యార్థులు మిహిరా సూద్, అభిషేక్ తివారీ బీసీఐ తీరుపైన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీనియర్ అడ్వకేట్ పరమేశ్వర్ విద్యార్థుల కేసును వాదించారు. ఈ కేసు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనానికే వెళ్లింది. ఇక్కడే ఈ కేసు కొత్త మలుపు తిరిగింది.

ఇది నల్సార్ యూనివర్సిటీ కేసు అని చాలా మంది అనుకుంటున్నారు. కానీ, ఈ కేసు అసలు సుప్రీంకోర్టులోనే ఆరంభం అయ్యి, తిరిగి సుప్రీంకోర్టుకే వచ్చింది. ఈ ఏడాది మేలో ఒక కేసు విషయమై సుప్రీంకోర్టుకు వచ్చిన సమాచార హక్కు కార్యకర్తలను సీజేఐ 'బొద్దింక'లంటూ కసురుకున్నారు. ఆ విసుర్లనే ఆత్మగౌరవంగా భావించి, బొద్దింకల ఉద్యమం మొదలయ్యింది. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా, కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుతో, యువతరం ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరసనలు చేపట్టింది. నిరసనకారుల మీద లాఠీలతో విరుచుకుపడితే ఈ ఉద్యమం ఆగిపోతుందని కేంద్ర ప్రభుత్వం భావించింది. విద్యార్థుల మీద తీవ్రంగా లాఠీచార్జి జరిగింది. కానీ, లాఠీ కర్రకు మేకులు దించి కొట్టారు! సంప్రదాయ నిర్వచనం ప్రకారం అది లాఠీచార్జి కాదు; మేకులు దించడం. ఆపైన తుపాకుల్లో పెల్లెట్లు పెట్టి కాల్పులు జరిపారు.

నిజానికి ఇలాంటి దురంతాలు జరిగినప్పుడు భారత ఉన్నత న్యాయస్థానం సుమోటోగా స్పందించవచ్చు. అలా జరగలేదు. పైగా, పోలీసుల వ్యవహార శైలి మీద స్పందించాలని కొందరు అడ్వకేట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించి లాఠీచార్జికి సంబంధించిన వీడియోలను పరిశీలించమన్నప్పుడు సీజేఐ అసహనాన్ని వ్యక్తం చేశారు. తన సమయాన్ని వృథా చేయవద్దని మందలించారు. ఈ వార్త వైరల్ అయ్యింది. జెన్‌జీకి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి దానికి ముందున్న తరాలు జెన్ వై, జెన్ ఎక్స్ కూడా నిరసనలకు మద్దతుగా వచ్చాయి. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించక తప్పలేదు. 'ఉన్నత న్యాయమూర్తులకు పదవీ విరమణానంతరం నామినేటెడ్ పదవులు ఇవ్వరాదు' అన్న డిమాండును బొద్దింకల ఉద్యమం ముందుకు తెచ్చింది. ఎవరిని ఉద్దేశించి ఈ డిమాండు పుట్టిందో తెలియనివారుండరు. ఇన్ని మెలికలు తిరిగిన నల్సార్ కేసు చివరకు అదే సీజేఐ ధర్మాసనానికే వచ్చింది. గతంలో రెండుసార్లు జరిగిన పొరపాట్లను జస్టిస్ సూర్యకాంత్ ఈసారి చేయదలచుకోలేదు. విద్యార్థులకూ తనకూ మధ్య జరుగుతున్న వ్యవహారంలో తలదూర్చడానికి బీసీఐ ఎవరు? అని గట్టిగా అడిగారు. మానన్‌కుమార్ మిశ్రాకు పెద్ద షాకిచ్చారు. అంతేకాదు, నిరసన వ్యక్తం చేసే ప్రజాస్వామిక హక్కు విద్యార్థులకు ఉందని గట్టిగా సమర్థించారు. తాను కూడా కాలేజీ రోజుల్లో నిరసనల్లో పాల్గొనేవాడినని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అంతిమ తీర్పులో-- అడ్వకేట్లు కాకముందు విద్యార్థుల వ్యవహారాల్లో తలదూర్చే అధికారం బీసీఐకు లేదని తీర్పు ప్రకటించారు.

మానన్‌కుమార్ మిశ్రాకే కాదు; బొద్దింకల నిరసనోద్యమం విషయంలో ఢిల్లీ పెద్దల మెప్పు కోసం దిగజారుడు పనులు చేసిన వారందరికీ నల్సార్ లా విద్యార్థుల నిరసన కేసుపై వచ్చిన ఈ తీర్పు ఒక చెంపపెట్టు లాంటిది!

## మొర్రిగూడలో ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు..



**జన్నారం,సెప్టెంబర్10(సూర్యరేఖ)**జన్నారం మండలం మొర్రిగూడ గ్రామంలో శ్రావణ అమావాస్య సందర్భంగా పొలాల అమావాస్య వేడుకలను గ్రామస్తులు,రైతులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు కారెద్దులకు స్నానం చేయించి,కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చేశారు.పితృదేవతల ఆత్మశాంతిని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

## జన్నారం మెయిన్ రోడ్డుపై దుమ్ము ధూళి.. వాహనదారులకు ఇబ్బందులు



**జన్నారం,సెప్టెంబర్10(సూర్యరేఖ)**జన్నారం మెయిన్ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము ధూళి ఎగసిపడుతోంది.దీంతో వాహనదారులు, మార్కెట్కు వెళ్లే ప్రజలు,స్కూల్కు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అలాగే గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము ధూళిని అరికట్టేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎస్‌జీఎఫ్ కబడ్డీలో నిజాంపేట జోరు..



**నిజాంపేట,సెప్టెంబర్10(సూర్యరేఖ)** పీఎం శ్రీ నిజాంపేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా మూడో రోజు కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి.వివిధ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.అండర్-17బాలుర విభాగంలో నిజాంపేట పాఠశాల మొదటి స్థానం, చల్మెడ పాఠశాల రెండో స్థానంలో నిలిచాయి. అండర్-17బాలికల విభాగంలో నిజాంపేట పాఠశాల ప్రథమ,నస్కల్ పాఠశాల ద్వితీయ స్థానాన్ని సాధించాయి.అండర్-14బాలుర విభాగంలో చల్మెడ పాఠశాల మొదటి స్థానం,కల్వకుంట పాఠశాల రెండో స్థానం సాధించగా,అండర్-14 బాలికల విభాగంలో నస్కల్ పాఠశాల ప్రథమ,గుడ్ షెపర్డ్ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి.విజేత విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమంలో పీఎం శ్రీ నిజాంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం జ్ఞానమల, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో పిటి ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు..



**నిజాంపేట,సెప్టెంబర్10(సూర్యరేఖ)** బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వకముందే ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమని మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మావురం రాజు మండిపడ్డారు.గురువారం తెల్లవారుజామున 6గంటలకే నాయకుల ఇళ్లకు వెళ్లి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు .కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు.రానున్న రోజుల్లో ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మావురం రాజు ధీమా వ్యక్తం చేశారు.

## ఓటర్లకు అండగా నిలుస్తూ సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓ పద్మావతి..



**బెల్లంపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని 33వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ప్రతి ఓటరికి బీఎల్ఓ పద్మావతి సహాయ సహకారాలు అందిస్తూ బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు.ఓటర్లు తమకు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవడం, వాటిని పరిశీలించడం,సంబంధిత ప్రక్రియను పూర్తి చేసుకోవడంలో ఆమె మార్గనిర్దేశం చేస్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు.సహాయకుడు ప్రవీణ్‌తో కలిసి నోటీసులు అందుకున్న ప్రతి ఓటరిని వివరాలు అడిగి తెలుసుకుంటూ,అవసరమైన పత్రాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియలో సహకరిస్తున్నారని పేర్కొన్నారు.ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వారికి ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ,అందుబాటులో ఉంటూ సహాయం చేస్తున్న పద్మావతి సేవలను స్థానికులు అభినందిస్తున్నారు.బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రతి ఓటరికి అందుబాటులో ఉండి సహకరిస్తున్న బీఎల్ఓ పద్మావతి తమ వార్డుకు ఉండటం సంతోషంగా,గర్వంగా ఉందని స్థానిక ప్రజలు పేర్కొన్నారు.ఓటర్లు తమ ఓటు హక్కుకు సంబంధించిన ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేసుకునేలా సహకరించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో సహాయకులు ప్రవీణ్,బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు


## నోటీసులు వచ్చిన ఓటర్లు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి..



**బెల్లంపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని 86,87,88వ బూత్‌ల పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచనలతో, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్‌బాబు పర్యవేక్షణలో సంబంధిత అధికారులు,బీఎల్ఓలు, బీఎల్ఏలు,ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రక్రియను నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా నోటీసులు అందిన ప్రతి ఓటరు తమ ఓటును కాపాడుకునేందుకు అవసరమైన పత్రాలను సమర్పించి ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఎస్ఎస్‌సీ మెమో,కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం లేదా పాస్‌పోర్ట్ వంటి అందుబాటులో ఉన్న పత్రాలను జతచేసి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్,86వ బూత్ బీఎల్ఓపోతారవేణి స్వరూప,87వ బూత్ బీఎల్ఓ జి.భారతమ్మ,88వ బూత్ బీఎల్ఓతో పాటు 31,32,33వ వార్డుల కౌన్సిలర్లు,బూత్ బీఎల్ఏలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆలస్యం చేయకుండా సంబంధిత కేంద్రానికి చేరుకుని ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

## వినాయక చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి..

నెన్నెల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి



**నెన్నెల,సెప్టెంబర్10 (సూర్యరేఖ)** రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించే వారు పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని నెన్నెల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి సూచించారు. విగ్రహాల ప్రతిష్ఠ,మండపాల ఏర్పాటుకు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.దరఖాస్తును పరిశీలించిన అనంతరం పోలీసుశాఖ జారీ చేసే అధికారిక అనుమతి పత్రం పొందిన తర్వాతే మండపాలు,మైక్ సెట్లు,ఇతర ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.అనుమతి లేకుండా విగ్రహాలను ప్రతిష్ఠించరాదని స్పష్టం చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా ,సురక్షిత వాతావరణంలో జరిగేలా మండల ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

## అత్యవసర వేళ సీపీఆర్‌తో ప్రాణాలు నిలబెట్టేలా శిక్షణ..

కాసిపేట-1ఇంక్లైన్‌లో రెస్క్యూ బృందం ఆధ్వర్యంలో హ్యాండ్స్-ఆన్ డెమాన్‌స్ట్రేషన్




**మందమర్రి,సెప్టెంబర్10(సూర్యరేఖ)**అత్యవసర పరిస్థితుల్లో వైద్య సాయం అందేలోపు ఒకరి ప్రాణాన్ని నిలబెట్టగలిగే కీలక నైపుణ్యం సీపీఆర్ అని,ప్రతి ఉద్యోగి దానిపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని రెస్క్యూ బృందం పేర్కొంది.కాసిపేట-1ఇంక్లైన్‌లో గురువారం ఉద్యోగులు, అధికారులకు సీపీఆర్‌పై అవగాహనతో పాటు ప్రత్యక్ష శిక్షణ నిర్వహించారు .రెస్క్యూ ఇన్‌చార్జి రామ్‌మోహన్ ఆధ్వర్యంలోని బృందం గుండె స్పందన ఆగిపోయిన సందర్భాల్లో బాధితుడిని గుర్తించడం, వెంటనే స్పందించడం ,ఛెస్ట్ కంప్రెషన్స్ నిర్వహించడం, అత్యవసర సహాయం అందే వరకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.కేవలం అవగాహనకే పరిమితం కాకుండా ఉద్యోగులు,అధికారులు స్వయంగా సీపీఆర్ చేసేలా హ్యాండ్స్-ఆన్ శిక్షణ ఇచ్చారు.భద్రత అంటే ప్రమాదాల నివారణ మాత్రమే కాదు..ప్రాణాలను కాపాడే సామర్థ్యమూ కావాలి అని మేనేజర్ డి.సతీష్ అన్నారు.గనుల్లో అనుకోని అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సకాలంలో స్పందించడం ఎంతో కీలకమని తెలిపారు.వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడికి ప్రాణరక్షణ అవకాశం కల్పించవచ్చన్నారు.ఉద్యోగులందరూ ఇటువంటి ప్రాణరక్షక నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ వెంకటేష్,సేఫ్టీ ఆఫీసర్ సురేష్,ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ వి.రాజేందర్,ఇతర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం..




**మందమర్రి,సెప్టెంబర్10,(సూర్యరేఖ)**మండలంలోని పొన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు ఆకుదారి రాజయ్యను గ్రామ సర్పంచ్ పెంచాల మధు ఘనంగా సన్మానించారు.గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభలో సర్పంచ్ పెంచాల మధు మాట్లాడుతూ...ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలు అందించి అవార్డు పొందడం పాఠశాలకే గర్వకారణమని పేర్కొన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.రాజయ్యను అభినందిస్తూ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంచాల అమృత,వార్డు సభ్యుడు బోర్లకుంట లక్ష్మణ్, పాఠశాల చైర్మన్ గోగు సుమలత,ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య,ప్రధానోపాధ్యాయుడు రాపిల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సమాజ సేవలకు గుర్తింపుగా నంది అవార్డు అందుకొన్న శ్రీనివాస్ చారి..



**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** హైదరాబాద్ నగర బొడ్డున ఉంటూ సమాజ సేవయే ఊపిరిగా గోశాలలు ఏర్పాటు చేయడం, పేద,మధ్య తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఇప్పియడం ,వయసుమళ్ళిన పేద ,మధ్య తరగతి వృద్ధులను చేరదీసి వృధాశ్రమంలో చేర్పించడం వంటి సమాజ సేవలో లీనమైన శ్రీనివాస్ చారి సేవలను గుర్తించి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖా,గాన కోకిల కళానికేతన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాన కోకిల కళానికేతన్ కార్యవర్గం ఉత్తమ సమాజ సేవకులుగా గుర్తించి శ్రీనివాస్ చారిని నంది అవార్డుతో సత్కరించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ చారి పలువురి ప్రశంసలు అందుకొవడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...నంది అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని,ఆనందంతో పటు మరింత భాద్యతను కూడా పెంచుతుందని తెలిపారు.తాను పురాతన దేవాలయాకు దాతల చేత సహాయం అందించేందుకు కృషి చేయడం,గోసేవయే మాధవ సేవ అని అందులో గోశాలలు ఏర్పాటు చేసి పశుగ్రాసం సమకూర్చడం జరుగుతోందన్నారు.రోడ్లపై తిరుగుతున్న గోవులను చేరదీసి వాటిని సమీపంలోని గోశాలలకు అప్పగించడం జరుగుతోందని పేర్కొన్నారు.

# ఉత్సాహంగా ప్రారంభమైన ఏరియా 62వ అంతర్ విభాగీయ వార్షిక క్రీడా పోటీలు..





మైదానంలో సింగరేణి క్రీడా సందడి..

**మందమర్రి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** మందమర్రి ఏరియాలో 62వ అంతర్ విభాగీయ వార్షిక క్రీడా పోటీలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి.స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను అధికారికంగా ప్రారంభించారు. సింగరేణి సంస్థ వార్షిక క్రీడా పోటీల షెడ్యూల్‌లో భాగంగా తొలిరోజు ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు.కాసిపేట-2,కేకే-5 జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌కు జీఎం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జీఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ... క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మంచి ఉపశమనాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన,దృఢమైన ఉద్యోగులతోనే సంస్థ మెరుగైన ఉత్పత్తి సాధించి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు.సింగరేణి యాజమాన్యం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ప్రతి ఏరియాకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం రూ.4.50లక్షలు కేటాయించిందని వెల్లడించారు.ఈ నిధులతో క్రీడాకారులకు అవసరమైన నాణ్యమైన క్రీడా పరికరాలను సమకూర్చనున్నట్లు తెలిపారు.క్రీడలు సమైక్యత, నాయకత్వ లక్షణాలు,పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని అన్నారు.సింగరేణి క్రీడాకారులు ఏరియా స్థాయిని దాటి కంపెనీ,కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించి సంస్థ ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు.మైదానంలో ప్రదర్శించే క్రమశిక్షణ, పట్టుదలను విధుల్లోనూ కొనసాగించి సంస్థ పురోగతికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొలిరోజు జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో కేకే-5 గ్రూప్ విజేతగా,కాసిపేట-2గ్రూప్ రన్నరప్‌గా నిలిచింది.ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్,డీజీఎం (పర్సనల్) సీహెచ్.అశోక్,ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ,క్రీడల కార్యదర్శి ఎం.కార్తీక్,క్రీడల సమన్వయకర్త ఎస్.శివకృష్ణ,జనరల్ కెప్టెన్ సాక శ్రీనివాస్,క్రీడల కెప్టెన్లు,గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులు,క్రీడాకారులు, ఉద్యోగులు, అభిమానులు పాల్గొన్నారు.ఖ

## లక్ష్మణ్‌కు మంజూరైన రూ.19వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేసిన

వెంకటసాయినగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు




**రామంతపూర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** వెంకటసాయినగర్ కాలనీకి చెందిన లక్ష్మణ్‌కు శస్త్రచికిత్స అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్)ద్వారా రూ.19వేల ఆర్థిక సాయం మంజూరైంది.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైంది.మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాలనీ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి,గౌరవ సభ్యులు, కాలనీ టీమ్ సభ్యులతో కలిసి లక్ష్మణ్‌కు అందజేశారు.ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజల సమస్యలకు ఎప్పటికప్పుడు స్పందిస్తూ,ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవలను అభినందించారు.ముఖ్యంగా పేద,మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ వంటి ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని అందేలా ఎమ్మెల్యే చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.లక్ష్మణ్ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ సాయం అందేలా సహకరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వెంకట సాయినగర్ కాలనీ తరఫున విజయేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇప్పటివరకు వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం అందిందని తెలిపారు.కార్యక్రమంలో గౌరవ సభ్యులు,టీమ్ సభ్యులు రవికుమార్, గోపాల్, సంజీవ్, శంకర్,ఆర్. గోవింద్,అశోక్,శ్రీనివాస్ గౌడ్,భూపతి నరసింహ, రామకృష్ణ,సి.శేఖర్,స్వామి,నరేష్,బి.చలపతిరావు, వేణుగోపాల్, ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా చాకలి ఐలమ్మ41వ వర్ధంతి వేడుకలు..



**నిజాంపేట,సెప్టెంబర్10(సూర్యరేఖ)** మండల కేంద్రంలో గురువారం రజక కులస్తుల ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం సభ్యుడు బూరుగుపల్లి రాజు మాట్లాడుతూ...భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ పోరాడారని కొనియాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే నిజాంపేట మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు బూరుగుపల్లి దుబ్బ రాజయ్య,మామిడాల రాజయ్య,మామిడాల లింగం,బాలయ్య,పరశురాములు,బూరుగుపల్లి రమేష్,లక్ష్మి,రాజవ్వ, యాదమ్మ, బాబు, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశివ శంకర మహామాయి దేవాలయంలో విశేష పూజలు అన్నప్రసాద వితరణ..





**ఉప్పల్,సెప్టెంబర్10 (సూర్యరేఖ)** ఉప్పల్ లోని శ్రీశివ శంకర మహామాయి దేవాలయంలో అధిక జేష్ఠ మాస అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అన్న ప్రసాద వితరణ జరిగింది.ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు ఉప్పాజి బలవంతచారి,బిక్షపతి, శ్రీనివాస్,చోల్లేటి శ్రీనివాస్, శ్రీధరచారి పాలేర్ల గోపి,శామీర్ పేట హనుమంత్ రెడ్డి,మామిళ్ళ మల్లేష్,కృష్ణరెడ్డి, గొంది ప్రశాంత్ రెడ్డి,జగన్,నర్సింహా రెడ్డి,అభిరామ్, గుమిడెల్లి కృష్ణ,గురువయ్య గౌడ్,నవీన్,ముదుగొండ రావి,ప్రవీణ్ రెడ్డి,నర్సింహా రావు,కొత్తకొండ రమేష్,మహేష్, జగన్,బిక్షపతి,రామ్ ప్రకాష్,గోపిచారి,పసుపు నేటి రమేష్, వెంకటయ్య,కుమార్,భాస్కర్ చారి,నవీన్ గౌడ్,రాజు,సందీప్ ,మహేష్ కుమార్,ప్రశాంత్ కుమార్,పవన్ కుమార్,భవాని శంకర్,సంతోష్ కుమార్,లక్ష్మణ్,సంతోష్ కుమార్,బంటి, శ్రీను,శ్రీనివాస్ గౌడ్,గణేష్ గౌడ్,యదిగౌడ్, వెంకటేష్,తదితర భక్తులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక:





మందుముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని రామంతాపూర్ చిన్న చెరువు దోబీఘాట్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి(ఎంపీఆర్) పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...భూమి కోసం,భుక్తి కోసం,బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన వీరత్వం,తెగువ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అని అన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ జీవితం ఒక గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం,పోరాట తత్వానికి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని,ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామంతాపూర్ రజక సంఘం అధ్యక్షుడు దానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి రవి,ప్రధాన కార్యదర్శి జిత్తు,బిడ్డుపల్లి ప్రసాద్,శ్రీనివాస్, సత్యనారాయణ, భీమేష్,అరుణ్ సాయి,బాల్ రాజ్,చిన్న శంకర్, బుయిషాపతి,మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగిరెడ్డి,డిసిసి ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, తౌఫిక్, జలీల్ పాషా,ఉపేందర్ రెడ్డి,ఆకారపు అరుణ్, సందీప్, రఫిక్,వల్లపు శ్రీకాంత్ యాదవ్,రాజిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్,హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి,హబ్సీగూడ డివిజన్ మాజీ అధ్యక్షులు గన్నారం విజయ్ కుమార్,సీనియర్ నాయకులు మురళీ కృష్ణ ముదిరాజ్,మాలు నాయక్,లక్ష్మీ నారాయణ,గరిక సుధాకర్,అనిల్,బుక్క సురేష్, భావనగౌడ్,నాగరాజు,నాగ శేషు,విజయ్, భాస్కర్, ముత్యాల జంగయ్య,ముత్యాల బాబు,బాలయ్య బాబు,శామ్యూల్,బెస్త భాస్కర్,షాగా శ్రీధర్,నయీం, సంజీవ,మాలునాయక్, చింటు సలీం, సంధ్యారాణి, మేంగా శోభ,అంబిక,శ్రీలత,వరలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం..

హక్కుల కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ..

జాతీయ చేనేత అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాసు,

ఎస్సి,ఎస్టి బిసి మైనారిటి సంక్షేమ అధ్యక్షులు మంద జగన్





**సికింద్రాబాద్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని జాతీయ చేనేత అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాసు అన్నారు. బౌద్ధనగర్ డివిజన్ ఏకశిలా చౌరస్తాలో గురువారం ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జాతీయ చేనేత అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాసు,ఎస్సి,ఎస్టి,బిసి,మైనారిటి సంక్షేమ అధ్యక్షులు మంద జగన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ చిక్క దేవదాసు మాట్లాడుతూ. .ఐలమ్మ ధైర్యసాహసాలు,అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం, పట్టుదల,పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.సామాన్య కుటుంబంలో జన్మించిన ఐలమ్మ అన్యాయాన్ని ఎదిరించేందుకు వెనుకడుగు వేయకుండా తన హక్కుల కోసం పోరాడారు.అప్పటి భూస్వామ్య,దొరల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారాని పేర్కొన్నారు.ఐలమ్మ పోరాటం కేవలం ఒక వ్యక్తి పోరాటం కాదని,అది ఆత్మగౌరవం,సామాజిక న్యాయం,సమానత్వం కోసం జరిగిన ప్రజా పోరాటానికి ప్రతీక అని కోరారు.ఈ కార్యక్రమంలో జానకిరామ్,సచిన్,జింకల మల్లేష్, తుకారాం, చింతకింది మల్లేష్,శీలం సాయియాదవ్, వైట్ల వెంకటాద్రి,సాయిచరణ్ గంగపుత్ర,తవుటం సతీష్,దిండిగల శ్రీకాంత్,చితురాల శ్రీనివాస్,ఎండి అక్బర్,రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బాంచన్ దొర..నీ కాల్మొక్తా అనే బానిసత్వానికి చరమగీతం పాడింది ఐలమ్మ





**మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్**

**చిలుకానగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి చిట్యాల ఐలమ్మ41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఉమ్మడి చిల్కానగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు.తెలంగాణ మేడేలయ్య రజక సంఘం ఉప్పల్ అధ్యక్షుడు కొల్లూరి శ్యామ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్,జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీత,బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం బన్నాల గీత మాట్లాడుతూ...భూమి కోసం,భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం,అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ వీరోచితంగా పోరాడారని అన్నారు.నిజాం పాలన,దొరల పెత్తనం, భూస్వాముల దౌర్జన్యాలు కొనసాగుతున్న సమయంలో వెట్టిచాకిరీ,మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా ఐలమ్మ ఒక మహిళగా తిరుగుబాటు పోరాటం సాగించారని తెలిపారు.పేద రజక కుటుంబానికి చెందిన ఆమె..దొరల పెత్తనాన్ని ప్రశ్నిస్తూ తన కష్టంతో సాగు చేసిన భూమిపై తనకే హక్కు ఉందని ధైర్యంగా నిలదీశారని పేర్కొన్నారు.తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్ర మహాసభ, అనంతరం కమ్యూనిస్టు ఉద్యమం ప్రజలను సంఘటితం చేస్తున్న సమయంలో ఐలమ్మ కూడా ఆ ఉద్యమంతో అనుబంధం ఏర్పరచుకున్నారని బన్నాల గీత తెలిపారు.తన ఇంటినే ఉద్యమ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చుకుని ప్రజలను చైతన్యపరిచారని అన్నారు.ఐలమ్మ కుటుంబాన్ని వేధింపులకు గురిచేసినా ,మహిళలపై అఘాయిత్యాలు, దాడులు జరిగినా ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గలేదని తెలిపారు. ఒక మహిళ చూపిన ధైర్యం తెలంగాణ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని చెప్పారు.“చాకలి ఐలమ్మ కేవలం ఒక పేరు కాదు..ఆమె ఒక చరిత్ర. ‘బాంచన్ దొర..నీ కాల్మొక్తా’అనే బానిసత్వానికి చరమగీతం పాడిన వీరనారి ఐలమ్మ”అని బన్నాల గీత పేర్కొన్నారు.విస్నూర్ దేశ్‌ముఖ్‌లు, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడి,గడీల ఆధిపత్యాన్ని సవాల్ చేసిన చరిత్ర ఐలమ్మదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జ్యోతి, ఉపేందర్,సుభద్ర,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,నేర్ధం భాస్కర్ గౌడ్,జల్లి మోహన్,కొక్కొండ జగన్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, రామాంజనేయులు,సత్యరాజ్ గౌడ్,మాస శేఖర్, అల్లిబిల్లి మహేందర్,రవీందర్ గౌడ్,బాలేందర్,ఆటో బాలు యాదవ్,నవీన్ గౌడ్,మేడేలయ్య రజక సంఘం ఉప్పల్ అధ్యక్షుడు కోలూరి శ్యామ్,జనరల్ సెక్రటరీ భామండ్ల రాజు, కనకయ్య, శ్రీను,మల్లేష్,సాయి కిరణ్, రాకేష్, రవికుమార్, మహేందర్, రాజు,సారయ్య, లింగం,సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బీహెచ్ కాలనీలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి..

**మున్సిపల్ డీసీ ఆనంద్‌కు ఎస్‌బీహెచ్ సొసైటీ ప్రతినిధుల వినతి..**

**ఉప్పల్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** ఎస్‌బీహెచ్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరుతూ ఎస్‌బీహెచ్ సొసైటీ ప్రతినిధులు ఉప్పల్ మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఎస్‌బీహెచ్ సొసైటీ జనరల్ సెక్రటరీ సందీప్ భూషణ్,అధ్యక్షుడు మహమ్మద్ గఫూర్‌లు డీసీని కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు.ఎస్‌బీహెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు,ప్రధాన రహదారిపై ఉన్న ఒక మీటర్ వ్యాసం గల పైపును తొలగించాలని కోరారు. అలాగే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని,కాలనీ పార్కులో పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను తొలగించి,అనధికారిక వాహనాల పార్కింగ్‌ను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.పార్కులో వాచ్‌మన్ గది నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు చిన్నారుల కోసం ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.కాలనీ వాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ పనులకు వెంటనే నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించాలని సందీప్ భూషణ్ కోరారు.దీనిపై డిప్యూటీ కమిషనర్ ఆనంద్ సానుకూలంగా స్పందిస్తూ,అవసరమైన నిధులు కేటాయించి పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్,కోశాధికారి శేఖర్ మోరే,కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వరరావు,ఎస్. వినోద్ కుమార్,టి.మనోజ్ కుమార్,కె.విజయ్



కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించిన ఆకారపు అరుణ్ పటేల్

**వెంకట్ రెడ్డినగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వెంకట్‌రెడ్డినగర్ డివిజన్‌లో రజక సంఘం అధ్యక్షుడు నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభలో ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు,యువ నాయకుడు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అరుణ్ పటేల్ మాట్లాడుతూ...“మన భూమిని,మన కష్టం,మన పంట,మన హక్కులను ఎవడో గుంజుకుంటే ఊరుకోవద్దు..తిరగబడాలె”అంటూ ఐలమ్మ ప్రపంచానికి పోరాట స్ఫూర్తిని చాటిచెప్పారని అన్నారు.బహుజనుల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని,ఆమె అందించిన స్ఫూర్తి కలకాలం నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు నర్సింగ్,ప్రధాన కార్యదర్శి మద్దూరి శ్రీనివాస్,బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ చారి,జాంగీర్,కాళివాసులు,గడ్డం సాయి,శంకర్, యాకాంత్, సుధాకర్,వెంకటేష్ గుప్తా,నవీన్,ఎల్లా చారి,ఎం.అంజయ్య, మల్లేష్,లక్ష్మయ్య,




మడికట్ల శ్రీనివాస్,రాములు,అశోక్,జి. శ్రీనివాస్,కృష్ణగౌడ్, మహేష్,ఎన్. సత్యనారాయణ,అంబదాస్ తదితరులు ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

## వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి..

**ఎస్సై రాజేష్..**



**నిజాంపేట,సెప్టెంబర్10(సూర్యరేఖ)** వినాయక చవితి పండుగ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నిజాంపేట ఎస్సై రాజేష్ సూచించారు.గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి గ్రామ పెద్దలు,నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పండుగ సందర్భంగా పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ముఖ్యంగా గణపతి మండపాల వద్ద డీజే సౌండ్‌కు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించి డీజే ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు,ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

## క్రమశిక్షణతోనే ప్రమాద రహిత ఉత్పత్తి..

**ఉద్యోగులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలి..**

**కేకే ఓసీ మేనేజర్ మధుసూదన్**




**మందమర్రి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ రక్షణ సూత్రాలను తూచా తప్పకుండా అమలు చేయడం ద్వారా ప్రమాద రహిత ఉత్పత్తి సాధించాలని కేకే ఓసీ మేనేజర్ మధుసూదన్ సూచించారు. గురువారం కేకే ఓసీలో ఉద్యోగులు,అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...విధుల్లో నిర్లక్ష్యం,రక్షణ నిబంధనలను పాటించకపోవడం వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.విధి నిర్వహణలో జరిగే చిన్నపాటి పొరపాట్లే తీవ్ర ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.పని ప్రదేశాల్లో పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు.అధికారి,ఉద్యోగి అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేస్తే కేకే ఓసీ మరింత అభివృద్ధి సాధిస్తుందని మేనేజర్ పేర్కొన్నారు.2026--27ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించి సింగరేణిలోనే సరికొత్త రికార్డు నెలకొల్పే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఓసీలో ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని,తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని చెప్పారు.‘సమస్తం మనదే’ అనే భావనతో పనిచేస్తేనే సంస్థ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని మేనేజర్ మధుసూదన్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మేనేజర్ మధుసూదన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్నకొండ ఆంజనేయులు,ఫిట్ కార్యదర్శి నూనె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## నామాపూర్ పాఠశాలకు శాస్త్రవేత్త ఉపేందర్ సహకారం..




**మెదక్ జిల్లా/పాపన్నపేట,సెప్టెంబర్10(సూర్యరేఖ)** అమెరికాలో నివసిస్తున్న ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మన్నే ఉపేందర్ నామాపూర్ పాఠశాలకు ఫర్నిచర్‌తో పాటు ప్రింటర్,సౌండ్ బాక్స్,ప్రొజెక్టర్ వంటి ఎలక్ట్రానిక్ సామగ్రిని గురువారం అందించారు. పాఠశాలకు అదనపు తరగతి గదిని నిర్మించడంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన సామగ్రిని అందించిన డాక్టర్ మన్నే ఉపేందర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాఠశాల చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ వరి పరిశోధన సంస్థను సందర్శించిన







## ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి పి.వి.సత్యనారాయణ

**రాజేంద్రనగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి పి.వి.సత్యనారాయణ జాతీయ వరి పరిశోధన సంస్థను గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా సంస్థ సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్ ఉపకులపతి పి.వి.సత్యనారాయణకు శాలువాకప్పి సన్మానించారు.అనంతరం జాతీయ వరి పరిశోధన సంస్థలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలతో ఉపకులపతి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వరి పంటలో నూతన వంగడాల అభివృద్ధి,వరి సాగులో వస్తున్న మార్పులు,వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల ప్రభావం తదితర అంశాలపై శాస్త్రవేత్తలతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.వాతావరణ మార్పులకు అనుగుణంగా వరి సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,పంట దిగుబడిని పెంచేందుకు చేపడుతున్న పరిశోధనలు,రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్న నూతన వంగడాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వరి పరిశోధనలను మరింత విస్తృతం చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఉపకులపతి సూచించారు.ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ హరిప్రసాద్,డాక్టర్ ప్రసాద్‌బాబు,డాక్టర్ సాయిప్రసాద్,డాక్టర్ నీరజ,డాక్టర్ లక్ష్మీప్రసన్న,డాక్టర్ లాహా,డాక్టర్ సోమశేఖర్,డాక్టర్ అక్షయ్ దేవర తదితరులు పాల్గొన్నారు.

# కొండల్ రెడ్డి కంపెనీకి భూమి కేటాయింపుపై కేటీఆర్,హరీశ్‌రావు పరిశీలన..






## రాజేంద్రనగర్ నుంచి తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు

**రాజేంద్రనగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి హరీశ్‌రావు,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,ఇతర ఎమ్మెల్యేల బృందం గురువారం రంగారెడ్డి జిల్లాలో పర్యటించింది.ప్రత్యేక సమావేశం అనంతరం కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేల బృందం కొంగర,రావిర్యాల ప్రాంతాల్లో పర్యటించి ఫోర్త్ సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి చెందిన కంపెనీకి భూమి కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలించింది.కేటీఆర్ పిలుపుతో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.కాంగ్రెస్ ప్రభుత్వం కొండల్‌రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7కోట్లకే కట్టబెట్టిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.కేవలం రూ.లక్షతో ప్రారంభమైనట్లు పేర్కొంటున్న టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేటాయించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు.టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి తాను చైర్మన్‌గా ఉన్నానని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి తన వృత్తిపరమైన వివరాల్లో పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. రేవంత్‌రెడ్డి సోదరులు ఎలాంటి వ్యాపార అనుభవం లేకుండా ఒక్కసారిగా కోట్ల రూపాయల విలువైన వ్యాపార సంస్థలకు చైర్మన్లుగా ఎలా మారారని ఆయన ప్రశ్నించారు.భూమి కేటాయింపులో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి,శీలం తిరుపతిరెడ్డి,మహమ్మద్ జహీరుద్దీన్,దేవదాస్,తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు గోల్లకొండ జోన్ శాంతి కమిటీ సమీక్షా సమావేశం..

### పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే ప్రతిష్ఠించేలా ప్రచారం..

### కృత్రిమ నిమజ్జన చెరువులు (ఆర్టిఫిషియల్ పాండ్స్) వినియోగించేలా ప్రోత్సహించాలి..




**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** రాబోయే గణేష్ చవితి ఉత్సవాలు,విగ్రహాల ప్రతిష్ఠాపన మరియు నిమజ్జన ఊరేగింపుల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ,సామరస్య వాతావరణంపై చర్చించేందుకు టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమ్మె ఫంక్షన్ హాల్ లో గోల్కొండ జోన్ శాంతి కమిటీ సమీక్షా సమావేశం గురువారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి గోల్కొండ జోన్ డిసిపి జె.రాఘవేంద్రరెడ్డి,అదనపు డిసిపి కృష్ణ గౌడ్,గోల్కొండ జోన్ శాంతి కమిటీ అధ్యక్షుడు,సభ్యులు,గోల్కొండ జోన్ విభాగపు ఏసిపిలు,ఇన్స్పెక్టర్లు హాజరయ్యారు.ఈ సమావేశంలో డిసిపి జె.రాఘవేంద్రరెడ్డి ప్రసంగిస్తూ...పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే ప్రతిష్ఠించేలా ప్రచారం చేయాలని,స్థానిక జలాశయాలను కాలుష్యం కాకుండా కాపాడుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కృత్రిమ నిమజ్జన చెరువులు (ఆర్టిఫిషియల్ పాండ్స్) వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. సామాజిక సామరస్యం పాటించాలని,పుకార్లను ఎక్కడికక్కడ నిరోధించాలన్నారు.ఆన్లైన్లో అసత్య ప్రచారాలు(ఫేక్ న్యూస్),ఉద్రిక్తతలు రెచ్చగొట్టే కంటెంట్ వ్యాప్తి చెందకుండా పోలీసులు,శాంతి కమిటీ సభ్యులు కలిసికట్టుగా పర్యవేక్షించి కోరారు.స్థానిక వివాదాలు,అసాంఘిక శక్తుల కదలికలపై శాంతి కమిటీలు నిఘా ఉంచుతూ పోలీసులకు సమాచారం అందించే విధంగా పోలీసులకు కళ్లు,చెవులుగా శాంతి కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## సీతాఫల్మండి రోడ్లకు మరమ్మతులు

### స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన అధికారులు

### మూడు రోజుల్లోనే పనులు పూర్తి




**సికింద్రాబాద్,సెప్టెంబర్10 (సూర్యరేఖ):**సీతాఫల్మండిలోని శాంతా శ్రీరామ్ అపార్ట్‌మెంట్స్,ఫ్రైడే మార్కెట్ నాలా ప్రాంతంలోని రోడ్లు అధ్వాన్నంగా మారడంతో స్థానికులు జి.ఎస్.ఆర్ బృందం సభ్యుడు సయ్యద్ సద్దాం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.వెంటనే సయ్యద్ సద్దాం ఈ విషయాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే,మాజీ డిప్యూటీ స్పీకర్ తీగళ్ల పద్మారావు గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు.స్థానికుల సమస్యను పరిగణనలోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు వెంటనే హైడ్రా,జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన అధికారులు తక్షణమే రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభించి కేవలం మూడు రోజుల్లోనే పనులను పూర్తి చేశారు.రోడ్ల మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయడంలో చొరవ చూపిన సూపర్‌వైజర్లు జైపాల్,షబ్బీ భాయ్,ప్రకాశ్‌లను బీఆర్ఎస్ నాయకులు అభినందించారు.సికింద్రాబాద్ ఎమ్మెల్యే,మాజీ డిప్యూటీ స్పీకర్ తీగళ్ల పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులను సద్దాం భాయ్,మర్రిపల్లి రవి,జి.ఎస్.ఆర్ బృందం సమన్వయం చేస్తూ అధికారులతో కలిసి పనులు పూర్తి చేయించారు.స్థానికుల సమస్యను వెంటనే పరిష్కరించేందుకు స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రమాదేవికి ఘన సన్మానం..




**రాజేంద్రనగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** ఎంపీపీఎస్ గణేష్‌నగర్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సుధా,కౌండిన్య,రాజశేఖర్ గౌడ్,రోహిణి,సరోజ,సంతోష్,శరత్‌బాబు,ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు మహేశ్వరి,మీనాక్షి కలిసి రమాదేవికి శాలువా కప్పి,పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి రమాదేవి చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు అభినందించారు.ఆమెకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు రావడం పాఠశాలకే గర్వకారణమని పేర్కొంటూ అభినందనలు తెలిపారు.

## గుడిమల్కాపూర్ డివిజన్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా రాజారామ్ నాగరాజ్ ..



**నాంపల్లి,హైద్రాబాద్, సెప్టెంబర్10(సూర్యరేఖ)** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గుడిమల్కాపూర్ డివి జన్ కన్వీనర్ గా రాజారామ్ నాగరాజ్ నియమితులైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజా రామ్ నాగరాజ్ మాట్లాడు తూ...హైదరాబాద్ పరిసర ప్రాంత చెరువుల్లో గణేష్ నిమజ్జనాలు యధావిధిగా కొనసాగుతాయని,చేతుల్లో గణేష్ నిమజ్జనాలను అడ్డుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.హైడ్రా లేదా మున్సిపల్,రెవెన్యూ అధికారులు ధార్మిక కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని,వినాయక నిమజ్జనం యథావిధిగా కొనసాగుతుందని రాజారామ్ నాగరాజ్ స్పష్టం చేసారు.ఈసారి హైదరాబాద్ నగర పరిధిలో సుమారు 1.40లక్షల గణేష్ మండపాలు ఏర్పాటు అవుతాయని వెల్లడించారు.ఈనెల14వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గణేష్ ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మండపాల వద్ద భద్రత,పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ,నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. న్యాయస్థానాల ఉత్తర్వులను పూర్తిగా గౌరవిస్తూనే ఉత్సవాలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ ప్రభుత్వానికి కోరిందన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం





### వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా,సెప్టెంబర్10(సూర్యరేఖ)** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. పండుగను ప్రజలందరూ సామరస్యంతో,సంతోషంగా జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు,డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్,మెదక్ ఆర్డీవో రమాదేవి,తూప్రాన్ ఆర్డీవో బావయ్యలతో కలిసి వినాయక చవితి వేడుకల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గణేష్ మండపాల ఏర్పాటు,విద్యుత్ సరఫరా,పారిశుద్ధ్యం, తాగునీరు,రహదారులు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పరస్పర సహకారంతో పనిచేసి వినాయక చవితి వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ...గణేష్ మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని కోరారు.


**అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు అందజేత..**

సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల చెరువులు,నదులు,ఇతర జలవనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు.మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్,రెవెన్యూ, గ్రామపంచాయతీ,విద్యుత్,ఫైర్,ఆర్అండ్‌బీ, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మెడినోవా వైద్యుల ఘన విజయం..

### 58ఏళ్ల మహిళలో 6.2కిలోల భారీ అండాశయ కణితి తొలగింపు..

### 32ఐ30 సెం.మీ.పరిమాణంలో కణితి..గుండె సమస్యలున్నా విజయవంతంగా శస్త్రచికిత్స



**మేడ్చల్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** మెదక్ జిల్లా గంధారపల్లికి చెందిన 58ఏళ్ల మహిళలో ఉన్న 6.2కిలోల భారీ అండాశయ కణితిని మేడ్చల్‌లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. గత మూడు నెలలుగా కడుపు ఉబ్బరం,అజీర్ణంతో బాధపడుతున్న ఆమె వైద్యులను సంప్రదించగా నిర్వహించిన పరీక్షల్లో పొత్తికడుపులో సుమారు 32ఐ30 సెం.మీ.పరిమాణంలో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు.కణితి పొత్తికడుపు నుంచి పైభాగం వరకు విస్తరించడంతో పాటు గర్భాశయం, సిగ్మాయిడ్ కోలన్,రెక్టమ్ తదితర పరిసర అవయవాలకు అంటుకుని ఉండటంతో శస్త్రచికిత్స క్లిష్టంగా మారిందని వైద్యులు తెలిపారు.పరీక్షల్లో రోగికి స్వల్ప గుండె సంబంధిత సమస్యలు,స్వల్ప పల్మనరీ హైపర్‌టెన్షన్ ఉన్నట్లు గుర్తించారు.

**వైద్య బృందం సమన్వయంతో విజయవంతమైన శస్త్రచికిత్స..**

గుండె పరిస్థితిని పూర్తిగా అంచనా వేసిన అనంతరం కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డా.సోనియారెడ్డి,జనరల్ సర్జన్ డా.మనోజ్ కుమార్,అనస్థీషియా నిపుణులు డా.మాధవ్ రెడ్డి,డా.శిరీషతో పాటు ఇతర వైద్య సిబ్బంది సమన్వయంతో ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ నిర్వహించారు.సుమారు 6.2కిలోల బరువున్న భారీ సీరస్ సిస్టాడెనోమా కణితిని అత్యంత జాగ్రత్తగా విజయవంతంగా తొలగించారు.గైనకాలజీ,జనరల్ సర్జరీ,కార్డియాలజీ,అనస్థీషియా విభాగాల నిపుణుల సమన్వయంతో శస్త్రచికిత్స విజయవంతమైందని వైద్యులు తెలిపారు.రోగి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి వెళ్లినట్లు వెల్లడించారు.క్లిష్టమైన ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు.చికిత్సలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.మేడ్చల్‌లోని మెడినోవా హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## గంజాయి వినియోగానికి అలవాటైన ముగ్గురికి డీ-అడిక్షన్ కేంద్రానికి తరలింపు..

### యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. భీమారం ఎస్ఐ ఎ.రాజేందర్

**చెన్నూర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని భీమారం ఎస్ఐ ఎ. రాజేందర్ సూచించారు.భీమారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి వినియోగానికి అలవాటుపడిన ఎం.డి.హబీబ్ (భీమారం),కృష్ణ ప్రసాద్,వినీత్ (దాంపూర్) లపై పోలీసులు కేసు నమోదు చేశారు.అనంతరం వారిని చెన్నూర్ గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా,వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడంతో పాటు కౌన్సెలింగ్,చికిత్స, పునరావాసం కల్పించేందుకు మంచిర్యాలలోని ప్రభుత్వ డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించాలని గౌరవ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ ఎ.రాజేందర్ మాట్లాడుతూ. ..గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు,కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని,మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు.మత్తు పదార్థాల అక్రమ వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఎస్ఐ పిలుపునిచ్చారు.




## ఏడాది కాలంగా ఉన్న సింగరేణి విద్యుత్ సమస్యకు పరిష్కారం..



**బెల్లంపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** బెల్లంపల్లి: పట్టణంలోని 1వ వార్డు,14వ వార్డు ప్రజలు గత ఏడాది కాలంగా సింగరేణి విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా,ఆయన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి సమస్యను వివరించారు.ఎమ్మెల్యే సంబంధిత సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్,పీసీసీ మెంబర్ చిలుముల శంకర్‌కు 1వ,14వ వార్డుల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్10 (సూర్యరేఖ)**తెలంగాణ సాయుధ పోరాటంతో తనదైన శైలిలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీదొడ్ల వెంకటేష్ గౌడ్ వారి కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ..నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చాకలి ఐలమ్మ ప్రదర్శిం చిన ధైర్య సాహసాలు,చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.ఆ కాలంలోనే హక్కుల సాధన కోసం న్యాయస్థానాల్లో చట్టపరమైన పోరాటం చేసిన ప్రజాస్వామిక వాది ఐలమ్మ అని గుర్తుచేశారు. నాడు ఐలమ్మ ప్రదర్శించిన స్ఫూర్తి,తెలంగాణ సాధనలోనూ,అనంతర ప్రగతి ప్రస్థానంలోనూ ఇమిడి ఉందని తెలియచేసారు.కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్,పోశెట్టిగౌడ్, మల్లేష్, ఖలీమ్,నరసింహ,సుధ, గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## 19వ వార్డులో సైడ్ కాలువ పనులు ప్రారంభం..



**బెల్లంపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** బెల్లంపల్లి బస్తీలోని19వ వార్డులో నూతన సైడ్ కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ దావ స్వాతి ప్రారంభించారు.కౌన్సిలర్ సిమ్రాన్‌తో కలిసి పనులను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ... పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో రోడ్ల విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

## క్రీడాకారులకు వాసవి క్లబ్ టీషర్టుల పంపిణీ..

### మూడు మండలాల టోర్నమెంట్‌కు వాసవియన్స్ ప్రోత్సాహం..

### క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం..వాసవి క్లబ్

### వాసవి క్లబ్ మరిపెడ అధ్యక్షులు గర్రెపల్లి నాగేష్




**మరిపెడ,సెప్టెంబర్10(సూర్యరేఖ)** మరిపెడ,చిన్నగూడూరు, నర్సింహుల పేట మూడు మండలాల క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్న టోర్నమెంట్లకు వాసవి క్లబ్ అండగా నిలిచింది.మరిపెడ ఎంపీడీవో కార్యాలయ మైదానంలో గురువారం,శుక్రవారం జరగనున్న టోర్నమెంట్ల సందర్భంగా క్రీడాకారులకు మరిపెడ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వాసవి క్లబ్ మరిపెడ అధ్యక్షులు నాగేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ గర్రెపల్లి వెంకన్న,వాసవి భవన్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల నాగేశ్వరరావు,వాసవి క్లబ్ పూర్వ అధ్యక్షులు ఉల్లి శ్రీనివాస్, వాసవి క్లబ్ వనిత,మరిపెడ అధ్యక్షులు గర్రెపల్లిహరిత, వాసవియన్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ బాటసారికి ఆత్మీయ వీడ్కోలు..

**సహచరుడి పాడె మోసిన బాల్కసుమన్,నల్లాల ఓదెలు**

**రవీందర్‌తో అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ విషణ్ణవదనంలో కన్నీటి పర్యంతమైన బీఆర్ఎస్ శ్రేణులు**



**మందమర్రి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** ఒకప్పుడు తెలంగాణ ఉద్యమ బాటలో కలిసి నడిచిన అడుగులు..ప్రజా సమస్యలపై కలిసి పోరాడిన గళాలు..సింగరేణి కార్మికుల హక్కుల కోసం భుజం భుజం కలిపి సాగిన పోరాటాలు..చివరకు అదే ఆత్మీయతతో ఓ ఉద్యమ సహచరుడికి చివరి వీడ్కోలు పలికే దృశ్యంగా మారాయి.మందమర్రి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు,తెలంగాణ ఉద్యమకారుడు జె.రవీందర్ అంతిమ యాత్ర గురువారం తీవ్ర విషాద వాతావరణంలో జరిగింది. రవీందర్ మృతి వార్త తెలుసుకున్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే,మాజీ ప్రభుత్వ విప్,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ హైదరాబాద్ నుంచి హుటాహుటిన మందమర్రికి చేరుకున్నారు.రవీందర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి దుఃఖంలో పాలుపంచుకుంటూ ధైర్యం చెప్పారు.అనంతరం రవీందర్ మృతదేహం వద్ద కొద్దిసేపు విషణ్ణవదనంతో కూర్చున్న బాల్క సుమన్ భావోద్వేగానికి గురయ్యారు.చివరి ప్రయాణంలోనూ వీడని స్నేహం గురువారం ఉదయం రవీందర్ అంతిమ యాత్ర ప్రారంభమైన సమయంలో ఉద్యమ సహచరుల అనుబంధం మరోసారి స్పష్టమైంది.మాజీ విప్‌లు బాల్క సుమన్,నల్లాల ఓదెలు స్వయంగా డప్పులు కొడుతూ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.బాల్క సుమన్ రవీందర్ పాడెను మోస్తూ చివరి ప్రయాణంలో తోడుగా నడిచారు.ఈ దృశ్యం అక్కడున్న బీఆర్ఎస్ శ్రేణులు,కార్మికులు, అభిమానులను తీవ్రంగా కలచివేసింది.టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి,రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్,టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ తదితరులు పాడె మోసి నివాళులర్పించారు.బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు,మహిళా,యువజన నాయకులు,సింగరేణి కార్మికులు ,అభిమానులు భారీగా తరలివచ్చారు.రవీందర్ మృతదేహం ఆయన నివాసానికి చేరుకున్నప్పటి నుంచి విషాద వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్,టీబీజీకేఎస్ నాయకులు,మహిళా కార్యకర్తలు కన్నీరుమున్నీ రయ్యారు.పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు రవీందర్ నివాసానికి చేరుకుని నివాళులర్పించారు.తెలంగాణ ఉద్యమం,కార్మిక ఉద్యమంలో రవీందర్‌తో కలిసి పనిచేసిన సహచరులు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజల సమస్యలపై స్పందించే నాయకుడిగా, కార్మికుల సమస్యలపై పోరాడే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.ఒక మంచి నాయకుడిని,ఉద్యమ సహచరుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.డప్పుల మోత మధ్య సాగిన అంతిమ యాత్రలో వినిపించిన నినాదాలు,కన్నీటితో వీడ్కోలు పలికిన అభిమానులు,పాడె మోసిన ఉద్యమ సహచరులు..రవీందర్ ప్రజాజీవితంలో ఏర్పరుచుకున్న అనుబంధానికి ప్రతీకగా నిలిచాయి. రవీందర్ భౌతికంగా దూరమైనా ఆయనతో కలిసి సాగిన ఉద్యమ జ్ఞాపకాలు,కార్మికుల కోసం చేసిన పోరాటాలు తమలో ఎప్పటికీ నిలిచిపోతాయని సహచరులు పేర్కొన్నారు.ఖ

## శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ..

**నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విద్యార్థులు**



**మందమర్రి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు శ్రీచైతన్య పాఠశాలలో 2026--27విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ సెర్మనీని గురువారం ఘనంగా నిర్వహించారు.విద్యార్థి ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో తమ నాయకత్వ బాధ్యతలను స్వీకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, ఎన్నికైన ప్రతినిధులకు బ్యాడ్జీలు,శాలువాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాయకత్వం అంటే కేవలం పదవి కాదని,అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వర్తించడమేనని అన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే బాధ్యత,కర్తవ్యనిబద్ధత, క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్తులో సమాజానికి ఆదర్శవంతమైన నాయకులుగా ఎదగగలరని పేర్కొన్నారు.పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.రమేష్ మాస్టర్ సేవలను కమిషనర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డీన్ కె. రవితేజ,ప్రైమరీ ఇన్‌చార్జ్ సునీత,పీపీటీ ఇన్‌చార్జ్ తిరుమల,జోనల్ ఇన్‌చార్జ్ రాజేందర్ పాల్గొన్నారు. పాఠశాల ఛైర్మన్ శ్రీధర్,డైరెక్టర్ శ్రీలక్ష్మి,జోనల్ ఏజీఎం అరవిందర్ రెడ్డి,కోఆర్డినేటర్ నాగరాజు విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు సమావేశానికి హాజరుకావాలి..



**బెల్లంపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు,నిబంధనలు తదితర అంశాలపై గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి పోలీసులు తెలిపారు.ఈనెల 11వ తేదీ శుక్రవారం ఉదయం10 గంటలకు బెల్లంపల్లిలోని పద్మశాలి భవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు.సమావేశానికి బెల్లంపల్లి ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరై నిర్వాహకులకు పలు సూచనలు,సలహాలు అందించనున్నారు.కావున పట్టణంలోని గణేష్ మండపాల నిర్వాహకులు అందరూ సమావేశానికి తప్పనిసరిగా హాజరై పోలీసులకు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బెల్లంపల్లి పోలీసులు కోరారు.

## నియోజకవర్గ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పర్ణికరెడ్డి



**నారాయణపేట ,సెప్టెంబర్ 10(సూర్యరేఖ)** :నారాయణపేట నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికరెడ్డి గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి చర్చించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.కోయిలకొండలోని శ్రీరామకొండ గుట్ట అభివృద్ధి పనులకు తిరిగి రూ.10 కోట్ల నిధులు కేటాయించి పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రతిపాదించారు.అలాగే కోయిలకొండ మండలానికి గురుకుల పాఠశాల నూతన భవనం మంజూరు చేయాలని,కోయిలకొండలో డిగ్రీ కళాశాల నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.మరికల్ మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని,నారాయణపేట పట్టణంలో శిథిలావస్థకు చేరిన జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని ప్రతిపాదించారు.నారాయణపేట పట్టణానికి భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణం మంజూరు చేయాలని,నూతన పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరారు.దామరగిద్దలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు.నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ ప్రతిపాదించిన పనులను పరిశీలించి నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.నారాయణపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.

# కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పీహెచ్డీ సాధించిన దీపాబానోత్






**హైదరాబాద్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** కాప్రా ఈసీఐఎల్ కు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ,డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధక విద్యార్థిని డా.దీపాబానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా,గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయం.డా.దీపా బానోత్ “తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ మరియు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం(తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన పబ్లిక్ మరియు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం)”అనే అంశంపై పరిశోధన జరిగింది.ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తికి తగిన సూచనలను కూడా ప్రతిపాదించారు.ఈ పరిశోధనను డా.వి.సమున్నత పర్యవేక్షణలో పూర్తి చేశారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు,డీన్ ప్రొఫెసర్ జహంగీర్,డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు,అధ్యాపకులు, పరిశోధకులు మరియు సిబ్బంది డా.దీపాబానోత్‌ను అభినందించారు.ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను(పెద్ద కుమారుడు ఎంబీబీఎస్ మరియు చిన్న కుమారుడు ఇంజనీరింగ్) చదువుతున్న సమయంలోనూ కుటుంబ భాద్యతలు చూసుకుంటూ పీహెచ్‌డీ సాధించడం ద్వారా దీపా బానోత్ తన సంకల్పం,పట్టుదల,కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్నా ఉన్నత లక్ష్యాలను సాధించినట్లు నిరూపించారు.ఈ సందర్భంగా డా.దీపాబానోత్ తన విజయానికి సహకరించిన తన భర్త రవితేజకు, కుటుంబ సభ్యులకు మరియు తన పరిశోధన పర్యవేక్షకురాలు డా.వి.సమున్నతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పరిశోధన సమయంలో వారు అందించిన నిరంతర ప్రోత్సాహం,సహకారం తన పీహెచ్డీ ప్రయాణంలో కీలకమని ఆమె పేర్కొన్నారు.ఆమె సాధించిన ఈ విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## మేడ్చల్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు..




**మేడ్చల్,సెప్టెంబర్10(సూర్యరేఖ)**తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడి, పేదలు,రైతులు,అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను మేడ్చల్‌లో బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ...నిజాం పాలన,భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని,తన భూమిని కాపాడుకునేందుకు చూపిన తెగువ తెలంగాణ ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు.మహిళలు సైతం సామాజిక అన్యాయాలపై ధైర్యంగా పోరాడగలరని చాటి చెప్పిన గొప్ప పోరాట యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు.ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ, సమాజంలో సమానత్వం,సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు,స్థానికులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

# పీవీటీజీ గ్రామాల్లో వైద్య సేవలు విస్తరించాలి..






**ప్రతి వారం వైద్య శిబిరాలు నిర్వహించాలి..**

**అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**మందమర్రి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** ప్రధానమంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్మన్)కార్యక్రమంలో భాగంగా ఆదిమ గిరిజన జాతులకు మెరుగైన వైద్యం,సంక్షేమ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు జిల్లా కలెక్టర్ చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి కాసిపేట మండలం వెంకటాపూర్ పీవీటీజీ గ్రామంలో నిర్మించిన మల్టీపర్పస్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమశాఖ,ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ కేంద్రం ద్వారా పీవీటీజీ కుటుంబాలకు వైద్యం,పౌష్టికాహారం,విద్య, సంక్షేమ పథకాలపై సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.కేంద్రంలో ప్రాథమిక విద్యా కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గ్రామంలో గర్భిణులు,బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, టీకాల కార్యక్రమం,అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం,అసంక్రమణ వ్యాధుల పరీక్షలు,ఆరోగ్య సిబ్బంది విధులను అదనపు కలెక్టర్ పరిశీలించారు.గ్రామస్తులతో విద్యుత్,తాగునీరు, గృహాలు, పింఛన్లు,ఆరోగ్యం,విద్య,రోడ్లు తదితర సమస్యలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు. వెంకటాపూర్‌తో పాటు పరిసర మూడు గ్రామాల ప్రజలకు ప్రతి వారం ఒకసారి వైద్య శిబిరం నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. పీఎం జన్మన్ కార్యక్రమం కింద వైద్యులు,సిబ్బంది క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించి సేవలు అందించాలని సూచించారు.మారుమూల ప్రాంతంలో పీవీటీజీలకు అందుతున్న వైద్య సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం శంకర్,ఉపసర్పంచ్ ప్రసన్న,ఎంపీఓ సాజిద్ అలీ,ఎంపీడీవో సత్యనారాయణ సింగ్,ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ దివ్య,జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కావెంకటేశ్వర్,పుట్ట సత్తయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి సునీత,ఆరోగ్య కార్యకర్తలు సుజాత,లక్ష్మి,ఆశా కార్యకర్తలు,పీఎం జన్మన్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.200 కోట్ల భూమిని రూ.7కోట్లకే కట్టబెట్టారంటూ బీఆర్ఎస్ నేతల ఆరోపణ..






**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను దోచిపెడుతూ భారీ భూకుంభకోణానికి పాల్పడుతుంది..**

**ప్రభుత్వ భూముల కేటాయింపులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలి..**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను దోచిపెడుతూ భారీ భూ కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి హరీశ్‌రావు,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు.గురువారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి కలిసి రూ.200కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.7కోట్లకే ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు .ప్రజాధనానికి చెందిన విలువైన భూములను నామమాత్రపు ధరలకు కేటాయించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని వారు ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అక్రమాలు,అవినీతి పరాకాష్టకు చేరాయని విమర్శించారు.ప్రభుత్వ భూముల కేటాయింపులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆస్తులను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ప్రభుత్వ భూముల కేటాయింపులపై వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో కాటేదాన్,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్,గుమ్మడి కుమార్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాముయాదవ్,మైసీ రెడ్డి,రాఘవేందర్ యాదవ్,రాజేష్ యాదవ్,రామస్వామి,కొంపల్లి జగదీష్, వెంకటరమణ,సునీల్,అనిల్, దుర్గాప్రసాద్, అశోక్ కుమార్, సురేష్, కృష్ణముదిరాజ్,క్రాంతి తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సా

## పౌష్టికాహారంతోనే విద్యార్థుల ఆరోగ్యం..

**వంటశాలల్లో పరిశుభ్రత తప్పనిసరి..**

**డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్**



**మందమర్రి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు వంటశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. గురువారం కాసిపేట మండలంలోని మల్కపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, వంటశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న మెనూ ప్రకారం భోజనం అందుతున్న తీరును,ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.వంటకు ఉపయోగించే పాత్రలు,ఇతర పరికరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని,వంట పూర్తయిన అనంతరం ఆహార పదార్థాలకు మూతలు పెట్టాలని సూచించారు. కూరగాయలు,పండ్లను ప్రతిరోజూ పరిశీలించి నాణ్యత ఉన్నవాటినే వినియోగించాలని ఆదేశించారు .తెలంగాణ ప్రభుత్వం విద్య,ఆరోగ్యం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోందని తెలిపారు.వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా పలు వ్యాధులను నివారించవచ్చన్నారు.విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు వైద్య ఆరోగ్య కార్యక్రమాలు,వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత,వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ దివ్య,జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్ సత్తయ్య,ఆరోగ్య సిబ్బంది,ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి



**రాజేంద్రనగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ):**నారాయణపేట జిల్లా రైతులకు సాగునీరు,త్రాగునీరు అందించేందుకు చేపట్టిన మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి భూములు ఇచ్చిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.ఎత్తిపోతల పథకం కోసం రైతులు తమ విలువైన సాగుభూములను ప్రభుత్వానికి అప్పగించి నష్టపరిహారం అందుతుందనే నమ్మకంతో అప్పులు చేసి ఇతర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ భూములను కొనుగోలు చేశారని తెలిపారు.కొంతమంది రైతులు ముందుగానే కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించి భూములు కొనుగోలు చేశారని,అయితే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.భూములు విక్రయించిన యజమానులు తమకు రావాల్సిన డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని,డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో తమ భూములను తిరిగి సాగు చేసుకుంటామని,భూములను వదిలి వెళ్లాలని చెబుతున్నారని రైతులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు రాము ముదిరాజ్ తెలిపారు.అప్పులు చేసి భూములు కొనుగోలు చేసిన రైతులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని,లక్ష రూపాయలు అప్పుగా తీసుకుంటే వడ్డీలతో కలిసి రెండు లక్షల రూపాయలకు చేరుతున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.నారాయణపేట జిల్లా అభివృద్ధి కోసం తమ సర్వస్వమైన సాగుభూములను కోల్పోయిన రైతులను మరింత ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.నష్టపరిహారం చెల్లింపులో ఏవైనా సాంకేతిక,పరిపాలనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు.మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన ప్రతి రైతు ఖాతాలో నష్టపరిహారం మొత్తాన్ని వెంటనే జమ చేసి రైతులకు న్యాయం చేయాలని రాము ముదిరాజ్ ముఖ్యమంత్రిని కోరారు.

## ఢిల్లీకి బయలుదేరిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు..






**రాజేంద్రనగర్,సెప్టెంబర్10 (సూర్యరేఖ)**అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేసేందుకు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఢిల్లీకి బయల్దేరారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి,జగదీశ్‌రెడ్డి,పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ వాణిదేవి ఢిల్లీకి వెళ్లారు.అసెంబ్లీ ప్రాంగణంలో వారి మీద జరిగిన దాడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్,జాతీయ మహిళా కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నారు.ఘటనకు సంబంధించిన వివరాలను కమిషన్ల దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.అసెంబ్లీ వద్ద మాజీ మంత్రులు,బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి,సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా కర్కశంగా వ్యవహరించిన పోలీస్ యంత్రాంగం సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకొని అమానుషంగా ప్రవర్తించారు.అంతటితో ఆగకుండా నలుపు రంగు చీర ధరించి అసెంబ్లీకి వెళ్తున్న సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారు.ఖాకీల దౌర్జన్యంతో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అసెంబ్లీ ముందు కంటతడి పెట్టుకున్న దృశ్యాలు వీడియోలో వైరల్ అయిన విషయం తెలిసిందే.

# రైస్ మిల్లులపై దాడులు ఆపాలి..





**మోహన్ రెడ్డి**

**కామారెడ్డి,సెప్టెంబర్10(సూర్యరేఖ)**రైస్ మిల్లులపై ఫిజికల్ వెరిఫికేషన్ పేరుతో జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని ఆలిండియా రైస్ మిల్లర్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.సిఎంఆర్ బియ్యం అప్పగించేందుకు డిసెంబర్ 31వరకు గడువు ఇవ్వాలని ఆయన కోరారు.గురువారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలు ఆయన పాల్గొన్నారు.1960నుంచి రైస్ మిల్లు పరిశ్రమ ఉందని,2014వరకు ముందు ప్రభుత్వానికి కావలసిన బియ్యాన్ని మిల్లులోనే కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు.పుణ్యానికి ధాన్యం ఇస్తే పందికొక్కుల వ్యవహరిస్తున్నారని కొందరు మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు.ధాన్యం పేరుతో ఇష్టారాజ్యంగా దాడులు చేస్తూ..వెరిఫికేషన్ పేరుతో మిల్లర్లను జైల్లో పెడితే సహించే సహించేది లేదని హెచ్చరించారు.2020 నుండి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం బిల్లులలో 74హెచ్పి ఉన్న బిల్లులను 350నుంచి 400హెచ్పివరకు బిల్లులు పెరిగేలా మిషన్లు కంప్రెషర్లు వేయించి ఆర్థిక భారం పెంచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో 75లక్షల మెట్రిక్ టన్నుల కామారెడ్డి జిల్లాలో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల వరకు సీఎంఆర్ చెల్లించాల్సి ఉందని,ఫిజికల్ వెరిఫికేషన్ పేరిట ఇబ్బందులకు గురి చేయవద్దని ఆయన కోరారు 2014 నుంచి 2024 వరకు 9.70కోట్ల ధాన్యం మిల్లర్లకు అప్పగిస్తే 9.60 కోట్ల బియ్యాన్ని అప్పగించామని,కేవలం రెండు శాతం బకాయి కోసం 98శాతం మందిని వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.క్వింటాలుకు 67కిలోల బియ్యం రాదని చెప్పిన వినడం లేదని,67 కిలోల అంశంపై నిర్ధారణ కమిటీ వేయాలని,67 కిలోలు వస్తుందని నిరూపిస్తే రైస్ మిల్లర్ అందరము తప్పయిందని ఒప్పుకుంటామని సవాల్ విసిరారు. గతంలో జిల్లాలో 36షుగర్ ఫ్యాక్టరీలు ఉండేవని ఆ ఫ్యాక్టరీలు ఆర్థికంగా దెబ్బతిని,మూతపడ్డాక రైతులు చెరుకు పండించడం తగ్గించాలని ఫలితంగా చెరుకు విస్తీర్ణం తగ్గి చక్కర ధరలు ఆమాత్రం పెరిగాయని గుర్తు చేశారు.అదే తరహాలో మిల్లలను ఇబ్బందులు పెడితే ఈ పరిశ్రమలు కూడా మూతపడితే రైతు వరికి బదులు కూరగాయలు పండించి బతకాల్సి వస్తుందని,అప్పుడు బియ్యం దారులు అమాంతం పెరుగుతాయని హెచ్చరించారు.ఒక్క ఎలోనే వస్తేనే తట్టుకోలేకపోయారని దేశంలో మూడు నాలుగు ఏళ్ళు పంటలు పండగ కరువు వస్తే ప్రపంచంలో ఏ దేశానికైనా అన్నం పెట్టే స్థితిలో ఉన్న భారతదేశానికి ఏ దేశ మన్నం పెడుతుందని ప్రశ్నించారు. అసెంబ్లీ సెషన్స్ ముగిశాక తమతో చర్చలు జరపాలని,డిసెంబర్ 31వరకు గడువు ఇవ్వాలని ప్రభుత్వానికి బియ్యం అప్పగించిన తర్వాత వచ్చే పంట తమకు ఇవ్వాలన్నారు.ఈ ధర్నా కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్,జిల్లా కార్యదర్శి సంతోష్,కోశాధికారి ముత్యపు సుదర్శన్,మాజీ అధ్యక్షుడు కంచర్ల లింగం,మాజీ కార్యదర్శి గౌరీ శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలి..




**కామారెడ్డి,సెప్టెంబర్10(సూర్యరేఖ)**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తెలంగాణ ఆదర్శ పాఠశాల సదాశివనగర్ ను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో సంభాషించడం జరిగింది విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు ఉదాహరణకు మన అమ్మ చాక్లెట్ డబ్బా సజ్జపై ఉంచినచో దాన్ని అందుకోవాలని ఎలా ప్రయత్నిస్తామో అలాగే తమ అనుకున్న లక్ష్యాన్ని కూడా అందుకోవాలని సూచించారు.విద్యార్థుల ఏమైనా ఇబ్బందులు ఉన్నచో తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.చైల్డ్ మ్యారేజ్ చేసుకోకూడదని దానివల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సూచించారు.చైల్డ్ మ్యారేజ్ వల్ల పుట్టబోయే సంతానంలో మానసికంగా కొంత తక్కువ అభివృద్ధితో శిశువులు జన్మించే అవకాశం ఉందని సూచించారు. పాఠశాలలో అత్యున్నత మార్కులు సాధించిన ఏ.సాత్విక బైపిసి ద్వితీయ సంవత్సరం అమ్మాయిని అభినందించడం జరిగింది.పాఠశాల పరిసరాలను గమనించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది.పాఠశాలకు అవసరమైన వనరుల గురించి ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి,కమిషన్ సభ్యులు,జిల్లా విద్యాధికారి మల్లికార్జున్,జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం,నాఘవేందర్,ప్రధానోపాధ్యాయులు కే. రాజారెడ్డి,గ్రామ పెద్దలు వడ్ల రాజేందర్,హాస్టల్ వార్డెన్ ప్రసన్న,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

## దేవాలయం లాంటి అసెంబ్లీని అవమాన పరుస్తున్న కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలు..

**కామారెడ్డి,సెప్టెంబర్10(సూర్యరేఖ)**




దేవాలయం లాంటి అసెంబ్లీని కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలు అవమానపరుస్తున్న తీరు చాలా బాధాకరమని కామారెడ్డి జిల్లాజనసేన పార్టీ నాయకులు జాజారి దినేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.22 ఏ సమస్యపై,విద్యార్థులకు ఫీజు రియంబర్మెంట్ సమస్యపై జనసేన పార్టీ శాంతియుతంగా పోరాడుతుంటే అధికార పార్టీ జనసేన పార్టీపై కక్షగట్టి రాష్ట్రంలో పార్టీని ఎదగనివ్వకుండా అడ్డుపడుతున్నారని రాష్ట్ర అధ్యక్షుడు నేమూరి శంకర్ గౌడ్ అన్నారు.అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు.అసెంబ్లీలో తీరు చాలా బాధాకరమని స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ పై తగు చర్యలు తీసుకోవాలని దినేష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.జనసేన పార్టీ తెలంగాణలో బలోపేతం దిశగా ముందుకు వెళ్తుందని,అక్రమ అరెస్టులతో జనసేనని ఆపలేరని,ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని దినేష్ తెలిపారు.

## పేదలకు గునిశాలు ఫౌండేషన్ ఆహార పంపిణీ..




**కాప్రా,సెప్టెంబర్10 (సూర్యరేఖ)**గునిశాలు ఫౌండేషన్ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో 200 మంది పేదలకు ఆహార పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు.ఫౌండేషన్ చైర్మన్ బి.సంతోషి తన తండ్రి గునిశాలు 26వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.తండ్రి జ్ఞాపకార్థం పేదలు,వృద్ధులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏటా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా 200మంది పేదలకు భోజనం అందించారు.ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు భోజనం అందించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.కేవలం వృద్ధాశ్రమ నిర్వహణకే పరిమితం కాకుండా సమాజంలో అవసరమైన వారికి సేవలు అందించడం అభినందనీ యమన్నారు. గునిశాలు జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో కొనసాగిస్తూ పేదలు,వృద్ధులకు అండగా నిలవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గునిశాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి,హైకోర్టు న్యాయవాది సుంకరి నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ పెద్ద చెరువు పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ఆహ్వానం పలికిన హబ్సిగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ రెడ్డి**

**పాల్గొన్న జోనల్ కమిషనర్ రాధికాగుప్త,హైడ్రా అధికారులు**



**హబ్సిగూడ,సెప్టెంబర్10(సూర్యరేఖ)**హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం సాయంత్రం స్వయంగా పరిశీలించారు.ఆయనతో పాటు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్త,ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహన్,హైడ్రా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ రెడ్డి రంగనాథ్ కి శాలువా కప్పి ఆహ్వానం పలికారు. పనుల పురోగతి,స్థానికులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు వంటి వివరాలపై చర్చించారు. అనంతరం కంది శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ...హైడ్రా చొరవతో ఏళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్న హబ్సిగూడ డివిజన్ స్థానికుల సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు.ఏకంగా రూ.19కోట్లతో మొత్తం18.23ఎకరాల రామంతాపూర్ పెద్ద చెరువు చుట్టు పక్కల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నందుకు గానూ,ఆహ్లాదకరమైన పార్కు,చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేస్తున్నందుకు గానూ డివిజన్ ప్రజల తరఫున సీఎం రేవంత్ రెడ్డి,అందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఉప్పల్ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి,హైడ్రా కమిషనర్ రంగనాథ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం,హైడ్రా చేపట్టిన సుందరీకరణ పనుల పురోగతిని రంగనాథ్ తో కలిసి స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ సీనియర్ నాయకులు ధర్మానాయక్, హబ్సిగూడ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసీఐఎల్‌లో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు..




**కాప్రా,సెప్టెంబర్10(సూర్యరేఖ)** తెలంగాణ రజక సమితి అధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి ఘనంగా జరిగింది.ఈసందర్భంగా ప్రముఖులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,బిజెపి రాష్ట్ర నాయకులు బేతి సుభాష్ రెడ్డి,సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య ముఖ్యఅతిథులుగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని అన్నారు.మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆయోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు,చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్,బొంతు శ్రీదేవి,పావని మణిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్,కొత్త అంజిరెడ్డి కాసం మహిపాల్ రెడ్డి,నాగిళ్ల బాల్ రెడ్డి, యాదగిరి రావు,మోహన్ రెడ్డి,బేతాళ బాలరాజు, సుడుగు మహేందర్ రెడ్డి,అల్లూరయ్య శ్రీకాంత్, ఏనుగు సీతారాంరెడ్డి,రహీం జయరాం,మణమ్మ , యాకయ్య,భాష,మహేష ్,శ్రీనివాస్,యావపురం రవి, అశోక్,పద్మారెడ్డి,గడ్డం శ్రీనివాస్,వెంకట్, శ్రీనివాస్, సత్యం,రవి,తెలంగాణ రజక సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శనిగరం అశోక్,రాష్ట్ర అధ్యక్షులు ముంజంపల్లి రాములు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజు,సోమయ్య రాష్ట్ర కార్యదర్శి సకినాల రవి,రాష్ట్ర కోశాధికారి జంజీరాల సత్యనారాయణ, రత్నాల కనకయ్య,కర్ణాకర్ కొమురయ్య,నరేష్ శ్రీకాంత్,యాకయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలేవి.

**టీఎస్ఐఐసీ కాలనీలో ఇష్టారాజ్యంగా బహుళ అంతస్తుల నిర్మాణం...**

**నిబంధనలకు తూట్లు..**

**ప్రశ్నించిన స్థానికులపై దాడులు..**



**కాప్రా,సెప్టెంబర్10(సూర్యరేఖ)** కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు నిరాటంకంగా కొనసాగుతోంది.జీహెచ్ఎంసీ నిబంధనలకు పాతర వేస్తూ కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కాప్రా సర్కిల్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణం సాగుతోంది.ఈ వ్యవహారంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ నిర్మాణదారులు,మధ్యవర్తులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు.

**ప్రశ్నిస్తే దాడులు..బెదిరింపులు.!**

నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న సదరు అక్రమ నిర్మాణాన్ని ప్రశ్నించినందుకు గాను నిర్మాణదారులు తమపై కక్షగట్టి దౌర్జన్యానికి దిగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడటమే కాకుండా,భౌతిక దాడులకు సైతం తెగబడుతున్నారని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు.సర్కిల్ పరిధిలో సామాన్యులు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా వాలిపోయే అధికారులు,ఇంత భారీ స్థాయిలో అక్రమ నిర్మాణం జరుగుతున్నా కనీసం పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

**పట్టించుకోని అధికార యంత్రాంగం..**

ఈ అక్రమ నిర్మాణం వల్ల భవిష్యత్తులో కాలనీలో నెలకొనే మౌలిక వసతుల సమస్యలు,ట్రాఫిక్ ఇబ్బందులపై పలుమార్లు సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారుల కార్యాలయాలను ముట్టడించి,కాలనీవాసులందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు,ధర్నాలు చేపడతామని వారు హెచ్చరించారు.

# కారేపల్లి 'మద్యం'సిండికేట్ దోపిడీ:

**అధికారులకు 'మామూళ్ల' మత్తు..పేద ప్రజల గుండెల్లో కత్తు.!**

**తెల్లవారుజామునే ఇళ్లల్లోకి మద్యం..మీ నిఘా ఏమైంది సార్.?**




**కారేపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** కారేపల్లి సింగరేణి మండలంలో మద్యం మాఫియా బరితెగించింది.నాలుగు వైన్ షాపుల యజమానులు సిండికేట్‌గా మారి సామాన్యులను నిలువుదోపిడీ చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, వైన్ షాపుల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.20,బెల్టు షాపుల్లో మరో రూ.40..ఇలా మొత్తంగా రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తూ పేద ప్రజల రక్తాన్ని తాగుతున్నారు.మండల పరిధిలోని 41గ్రామ పంచాయతీలకు తెల్లవారుజామున 5:30గంటలకే ఆటోల ద్వారా అక్రమంగా మద్యం సరఫరా జరుగుతోంది.ఊళ్లోకి పాలు ఆలస్యంగా వస్తున్నాయేమో కానీ,మద్యం మాత్రం పొద్దున్నే ఇళ్ల వద్దకే చేరుతోంది.దీంతో యువత భవిష్యత్తు నాశనమవుతోందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులారా..మీ 'మామూలు' నిద్ర ఎప్పుడు వీడుతుంది.?,మండల కేంద్రానికి ముక్కుసూటిగా ఈ అక్రమ దందా సాగుతున్నా.. ఆబ్కారీశాఖ సీఐ,ఇతర ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక మతలబు ఏంటి.? అని ప్రజలు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు చేపట్టకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

**అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రశ్నలు:**

పదేపదే ఫిర్యాదులు వస్తున్నా ఆప్కారీశాఖ ఎందుకు ఉలుకూ పలుకూ లేకుండా ఉంది.?అదనపు దోపిడీపై తనిఖీలు చేసి,బెల్టు షాపులకు అడ్డుకట్ట వేసే ధైర్యం అధికారులకు లేదా.?తెల్లవారుజామునే ఆటోల్లో సాగుతున్న మద్యం గుట్టును ఎప్పుడు రట్టు చేస్తారు.¯

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం..

**అదనపు కలెక్టర్ నగేష్**

**ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు..**



**మెదక్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** అణగారిన వర్గాల హక్కులు,ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... సామాజిక అన్యాయం,జమీందారీ వ్యవస్థ,దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు.విసునూరు దేశ్‌ముఖ్ దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించాయని పేర్కొన్నారు.నిరుపేద కుటుంబంలో జన్మించిన ఐలమ్మ ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూనే ప్రజల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు.రైతాంగ ఉద్యమంలో ఆమె పోషించిన కీలక పాత్రతో పాటు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో అసమానతలను తొలగించేందుకు,బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పట్టు పరిశ్రమతో రైతులకు మంచి ఆదాయం..

**ఏఎస్ఓ లింగం**






**మెదక్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** పట్టు పురుగుల పెంపకం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ (ఏఎస్ఓ) లింగం తెలిపారు.గురువారం చిలిపిచెడు మండలం గౌతాపూర్ గ్రామంలో రైతు బాబుసింగ్ ఏర్పాటు చేసిన పట్టు పురుగుల పెంపక కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఎస్ఓ లింగం మాట్లాడుతూ పట్టు పురుగుల పెంపకంలో రైతులు పాటించాల్సిన పద్ధతులు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.సాధారణంగా పట్టు పురుగులను పెంచిన 30రోజులలోపు అవి గూళ్లు అల్లుకుంటాయని తెలిపారు.మార్కెట్‌లో ఒక కిలో పట్టు గూళ్లకు సుమారు రూ.600నుంచి రూ.800 వరకు ధర లభించే అవకాశం ఉందన్నారు. పట్టు గూళ్లను జనగామ,సికింద్రాబాద్,తిరుమలగిరి ప్రాంతాల్లో విక్రయించుకోవచ్చని తెలిపారు.పట్టు పురుగుల పెంపక కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం జనరల్ కేటగిరీ రైతులకు 50శాతం,ఎస్సీ,ఎస్టీ రైతులకు 65శాతం వరకు సబ్సిడీ అందిస్తుందని వివరించారు.రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని పట్టు పరిశ్రమ వైపు అడుగులు వేయాలని ఏఎస్ఓ లింగం సూచించారు.

## విద్యుత్తు మౌలిక వసతులు పెంపొందిస్తున్నాం..


**డైరెక్టర్ నరసింహులు**



**రాజేంద్రనగర్,సెప్టెంబర్10(సూర్యరేఖ)** విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులకు గురికాకుండా డిమాండ్ కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంపొందిస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) నరసింహులు అన్నారు.గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో సబ్ స్టేషన్ పవర్ ట్రాన్స్ఫార్మర్-1,12.5 ఎంవిఏ నుండి16 ఎంవిఏ పిటిఆర్ ను డైరెక్టర్ ఆపరేషన్ నరసింహులు, ఆర్ఆర్ జోన్ చీఫ్ ఇంజనీర్ ఎల్.గోపయ్య, రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ రవిప్రసాద్, రాజేంద్రనగర్ డిఈ పి.రత్నాకర్ రావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యుత్ వినియోగదారులు క్షేత్రస్థాయిలో ఇబ్బందుల గురికాకుండా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించి అభివృద్ధి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో గగన్ పహాడ్ సబ్ డివిజన్ ఏడిఈ ఈశ్వర్ ప్రసాద్,అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై జనంలోకి జనసేన..

**జేఎస్పీ నాయకులు నక్క మల్లేష్,కంచర్ల నర్సాగౌడ్**



**కామారెడ్డి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** ప్రజా సమస్యలపై కామారెడ్డి జిల్లాలో జనసేన పార్టీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని జాజారి దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.22 ఏ భూముల విషయంలో అధికార పార్టీ సత్వరమే పరిష్కారం చూపి ప్రజలకు మేలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే ఫీజు రియంబర్మెంట్ విడుదల చేసి విద్యార్థులకు కాలేజీ యజమానులకు సహకారం చేయాలని వారు అన్నారు.కామారెడ్డి జిల్లాలో జనసేన పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని వారు అన్నారు.కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నిజాంసాగర్ చౌరస్తా నుండి దేవనపల్లి వరకు స్ట్రీట్ లైట్లు గత నాలుగు రోజులుగా వెలగడం లేదని,చిమ్మ చీకట్లో ప్రయాణం ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని,వెంటనే మున్సిపల్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకొని స్ట్రీట్ లైట్లు వెలిగేటట్లు చేయాలని వారు కోరారు.అలాగే నిజాంసాగర్ చౌరస్తాలో నాళాలపై కొందరు కంటైనర్లు పెట్టి పండ్ల దుకాణాలు,ఇతర దుకాణాలు పెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే మున్సిపల్ శాఖ అధికారులు నాలాలపై నిర్మించిన కంటైనర్లను తొలగించి ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని వారు కోరారు.లేనియెడల జనసేన పార్టీ తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు.

# ఐలమ్మ ఆదర్శం తో భూ పోరాటాలు ఉధృతం చేద్దాం.





-- సిపిఎం నేత కె.సత్య పిలుపు

**భద్రాది కొత్తగూడెం :** సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40 వర్ధంతి వీర తెలంగాణ నిప్పు కణిక చిట్యాల ఐలమ్మ అని, ఐలమ్మ నిర్వహించిన పోరాట వారసత్వాన్ని పునికి పుచ్చుకొని, విసునూరు దేశ్ ముఖ్ ఆనాటి పాలకులకు వ్యతిరేకంగా దోపిడీ నశించాలని ,భూమి పంచాలని ,అందరికీ సమాన హక్కులు కల్పించాలని, ఉద్యమించిన ఐలమ్మ స్ఫూర్తితో భూపోరటాలను ఉధృతం చేయాలని సిపిఎం పాల్వంచ పట్టణ కార్యదర్శి వర్గ కే సత్య అన్నారు. సభలో కె సత్య మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కామ్రేడ్ ఐలమ్మ చూపిన తెగువ ధైర్యం ఆనాటి పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. నైజాం సర్కార్ తన భూమిలో పంటను బలవంతంగా ఎత్తుకెళుతున్న తీరుకు నిరసనగా ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ అండతో తన పంటను కాపాడుకోవడానికి ఐలమ్మ చేసిన పోరాటం వలన పోరాటంలో పాల్గొనే ప్రజలకు మరింత స్ఫూర్తినిచ్చిందని అన్నారు. తనను తన కుటుంబాన్ని నైజాం మూకలు చిత్రహింసలకు గురిచేసినపట్టికి , ఏ మాత్రం భయపడకుండా తెగించి పోరాటం చేసిందని అన్నారు. ఐలమ్మ తన పంట కోసం సాగించిన పోరాటం మహత్తర తెలంగాణ ఉద్యమానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎంతోమంది కౌలు రైతులు, పేద రైతులు తమ పంటను రక్షించుకోవడానికి నైజాం నవాబు అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటంలోకి వచ్చారని అన్నారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితమే నేడు ఏ పాలక ప్రభుత్వాలు వచ్చినా భూ ఎజెండాను ముందుకు తీసుకొస్తున్నారని ఇది కమ్యూనిస్టుల విజయమని కొనియాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుండా పేద ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె విమర్శించారు. పేదల ఓట్లతో గెలిచిన వారు, తిరిగి వారిని విమర్శిస్తే ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇండ్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తు భూ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ కమిటి సభ్యులు బి కాంతి బి మాధవి శాఖ కార్యదర్శి బి సత్యమ్మ ఇందిర అరుణ లక్ష్మీ కుమారి పద్మ పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ



సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్





**హైదరాబాద్ :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్, హుక్కా సెంటర్ల యజమానులతో సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థలు చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ తమ కార్యకలాపాలను నిర్వహించాలని సూచించారు. ప్రతి వ్యాపార సంస్థకు అవసరమైన అన్ని అనుమతులు, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌ఓసీ, సీఎంసీ ఎన్‌ఓసీ, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎన్‌ఓసీ, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఓసీ తదితర అవసరమైన అనుమతులను పొందాలని సూచించారు. సిపిపిఎంఎస్ పోర్టల్ ద్వారా జారీ చేసిన లైసెన్సుల గడువు ముగిసిన వెంటనే వాటిని సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో లైసెన్సులు పొందిన సంస్థల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సంఖ్యలో హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ తదితర వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీపీ తెలిపారు. కొన్ని సంస్థలు సరైన లైసెన్సులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యే లైసెన్సులు, అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వ్యాపార యజమానులు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వివిధ శాఖలకు సంబంధించిన లైసెన్సులు, అనుమతుల సమయాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, నిబంధనలకు లోబడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను సూచించారు. పబ్స్, బార్లు తదితర సంస్థల్లో అనుమతించిన సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యకలాపాలు కొనసాగించరాదని సీపీ స్పష్టం చేశారు. నిర్ణీత సమయాలను ఖచ్చితంగా పాటించాలని, సమయం ముగిసిన తర్వాత మద్యం విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలు నిర్వహించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో బార్ అండ్ రెస్టారెంట్లు లోకి మైనర్లు ను అనుమతించవద్దని సూచించారు. వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన ఆధార్ ధృవీకరణ, గుర్తింపు పత్రాలు, వయస్సు నిర్ధారణకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనర్లను నిబంధనలకు విరుద్ధంగా పనిలోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. హోటల్స్, పబ్స్, రెస్టారెంట్లలో వినియోగదారుల ప్రవర్తనపై కూడా యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ఎవరైనా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు లేదా ఇతర ప్రముఖుల బంధువులమని చెప్పుకుని సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినా, నిబంధనలు ఉల్లంఘించినా వారికి ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమేనని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బార్లు, పబ్స్‌లలో గ్యాంగ్‌ల మధ్య గొడవలు, ఘర్షణలు జరిగే పరిస్థితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని సీపీ సూచించారు. ఇటువంటి ఘటనలు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు శాంతిభద్రతల సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాల వినియోగం, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు వ్యాపార సంస్థల యాజమాన్యాలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. తెలంగాణలో హుక్కా కార్యకలాపాలు నిషేధించబడిన నేపథ్యంలో, ఎట్టి పరిస్థితుల్లోనూ హుక్కా సెంటర్లను నిర్వహించరాదని సీపీ స్పష్టం చేశారు. జూవూూ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘిస్తూ హుక్కా కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడితే గరిష్టంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. సైబరాబాద్ పోలీసుల లక్ష్యం వ్యాపారాలను అడ్డుకోవడం కాదని, చట్టబద్ధంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి సైబరాబాద్ పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని సీపీ తెలిపారు. అయితే చట్టాలు, నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యాపారాలు నిర్వహించే సంస్థలపై మాత్రం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ తదితర సంస్థల యజమానులు పోలీసులకు సహకరిస్తూ నిర్ణీత సమయాలు, లైసెన్సింగ్ నిబంధనలు, సిబ్బంది వయస్సు ధృవీకరణ, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్రజా భద్రతకు సంబంధించిన అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్ సూచించారు. ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్, శేరిలింగంపల్లి డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్

# సైబరాబాద్ కమిషనరేట్‌లో కాళోజీ జయంతి



**శేరిలింగంపల్లి ,** తెలంగాణ భాష, యాస, సంస్కృతికి విశేష సేవలందించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ యం. రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ సాహితీ, సామాజిక సేవలను అధికారులు, పోలీసు సిబ్బంది స్మరించుకున్నారు. ప్రజల భాషలోనే ప్రజల సమస్యలను తన రచనల్లో ప్రతిబింబించిన కాళోజీ.. తెలంగాణ ప్రజల జీవన విధానం, కష్టాలు, ఆకాంక్షలకు తన కలంతో గొంతుకగా నిలిచారని సీపీ రమేష్ పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలు, అన్యాయాలు, అసమానతలపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. తెలంగాణ భాషకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో కాళోజీ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ యాసను, ప్రజల నుడికారాన్ని సాహిత్యంలో గౌరవప్రదంగా నిలిపిన ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అర్థం చేసుకుని, వాటిపై స్పందించే తత్వం కాళోజీ నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ ప్రజలతో మరింత సన్నిహితంగా పనిచేస్తూ వారి సమస్యలకు పరిష్కారం చూపే క్రమంలో ప్రజా భాష, ప్రజల భావోద్వేగాలను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజీకి ఘనంగా నివాళులర్పించారు.

## అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆల్ ఇండియా 4వ మహాసభలను విజయవంతం చేయండి..

ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ ...




**కారేపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)** ఈనెల 28న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ 29,30 తేదీలలో జరుగు అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను కారేపల్లి మండలం మాదారం గ్రామంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై.ప్రకాష్ మాట్లాడుతూ...కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల మూలంగా నేడు దేశంలో రైతాంగం పరిస్థితి తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడిందని,ఎన్నికలకు ముందు 2022 వరకు రైతుల యొక్క ఆదాయాన్ని రెట్టింపు చేసి రైతును రాజు చేస్తానన్న ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలు తుంగలో తొక్కి వేసినారని ఆరోపించారు .కేంద్రం తీసుకువచ్చిన రైతు కార్మిక వ్యతిరేక మూడు నల్ల చట్టాలను నాలుగు లేబర్ కోడులను విద్యుత్ బిల్లును ఎత్తివేయాలని లక్షలాదిమందితో ఢిల్లీ సరిహద్దులలో 750మంది అమరులైన ఫలితంగా మోడీ ప్రభుత్వం దిగివచ్చి వాటిని రద్దు చేస్తానని, రైతాంగం పండించిన అన్ని రకాల పంటలకు ఎంఎస్పి గిట్టుబాటు ధర స్వామినాథన్ సిఫారస్ లను కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తానని ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి లిఖితపూర్వకంగా వ్రాసి ఇచ్చి వాటిని అమలు చేయకుండా రైతాంగానికి తీవ్ర ద్రోహం చేసినారని మండిపడ్డారు.వీటన్నిటికీ వ్యతిరేకంగా రైతు కూలీలను ఐక్యం చేసి రైతాంగ పోరాటాలను ముందుకు తీసుకుపోయే విధంగా ఈ మహాసభలలో భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకొని ముందుకు తీసుకువెళుతుందని తెలిపారు. ఈనెల 28 ఖమ్మంలో జరిగే బహిరంగ సభను 29,30 తేదీలలో జరుగు మహాసభలను అన్ని వర్గాల ప్రజలు,రైతులు, కూలీలు,కార్మికులు,విద్యార్థి మేధావులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా మండల నాయకులు కోయిల శ్రీనివాస్,కావేటి నాగేశ్వరరావు,గడ్డం వెంకన్న,నరేష్, నరసింహారావు,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం:

ముగ్గురు ఎమ్మెల్యేల హామీ..





**కారేపల్లి,సెప్టెంబర్10(సూర్యరేఖ)**సమన్వయ ఉమ్మడి గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)పరిధిలో విధులు నిర్వహిస్తున్న భాషా పండితులు,వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ సమస్య త్వరలోనే పరిష్కారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విషయమై గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేల నివాస గృహంలో ముగ్గురు ప్రముఖ శాసనసభ్యులను(ఎమ్మెల్యేలను) గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు రెండవసారి కలిసి వినతిపత్రం అందజేశారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్,నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శాసనసభ్యులు,డాక్టర్ తెల్లం వెంకట్రావులను నాయకులు విడివిడిగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముగ్గురు ఎమ్మెల్యేలు.. భాషా పండితులు,వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడ్ అంశాన్ని స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి,ప్రభుత్వం ద్వారా తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఉపాధ్యాయులకు గట్టి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం (టీఈఏటీఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకరా రాంబాబు,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.పి. నాయక్, మాలోత్ ప్రతాప్ సింగ్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గూగులోత్ నరేష్ నాయక్, హరికిషన్, సురేష్,నాగప్రత్యూష,కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713